MAHANAGAR DINAPATRIKA

# మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 259 | పేజీలు : 8 | సోమవారం 7 సెప్టెంబర్ 2026 | వెల : 6-00



## విద్యార్థుల గొంతు వినండి


- లేదంటే 'ఛత్రోం కీ గూంజ్' తీవ్రమవుతుంది: రాహుల్
- మహారాష్ట్రలో వేలాది మంది విద్యార్థుల నిరసనలపై రాహుల్ గాంధీ స్పందన
- పేపర్ లీకులు, నిలిచిపోయిన నియామకాలపై ప్రభుత్వాన్ని నిలదీత
- ఎంపీఎస్సీ విశ్వసనీయతను దెబ్బతీశారంటూ బీజేపీ ప్రభుత్వంపై ఆరోపణ



## ఈ సమస్యల గురించి మాట్లాడరేం!

- అందనంత దూరంలో మీరు
- అందుకే ప్రచారాలు అవసరం
- మోదీపై ఖర్గే విమర్శలు
- ప్రధాని మోదీ 'యాంగ్రీ అంకుల్' వ్యాఖ్యలపై ఖర్గే స్ట్రాంగ్ కౌంటర్

# స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి



- కుప్పం నేతలతో సీఎం చంద్రబాబు
- ఎన్నికల్లో విజయం కోసం నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా సాగాలి
- పంచాయతీ, మండల, జడ్పీ, మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అన్నింటిలో గెలుపు కోసం కష్టపడాలి
- ఎన్నికల ఫలితాల్లో తేడా వస్తే ఉపేక్షించేది లేదు
- లాలూచీ రాజకీయాలకు స్వస్తి పలకాలని హితవు

అమరావతి, మహానగర్

5

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కుప్పం తెదేపా శ్రేణులు సన్నద్ధం కావాలని పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ముఖ్య నేతలతో ఆదివారం ఆయన ఉండవల్లి నివాసంలో సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో విజయం కోసం నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా సాగాలన్నారు. పంచాయతీ, మండల, జడ్పీ, మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అన్నింటిలో గెలుపు కోసం కష్టపడాలని సూచించారు. ఎన్నికల ఫలితాల్లో తేడా వస్తే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పినట్లు నేతలు పేర్కొన్నారు. పదవులు తీసుకుని కష్టపడకుండా కారణాలు చెబితే కుదరదన్నారు. లాలూచీ రాజకీయాలకు స్వస్తి పలకాలని హితవు పలికారు. కుప్పంలో స్థానిక ఎన్నికలకు - మిగతా2లో



# 1 నుంచి కొత్త పింఛన్లు

### నేటి నుంచి సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ

### అనర్హుల అడ్డుకట్టకు వివిధ దశల్లో తనిఖీ

### కేటగిరీలు, విడతల వారీగా పింఛన్ల మంజూరు

అమరావతి, మహానగర్

ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం కింద కొత్త లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం మార్గదర్శకాలు ప్రకటించింది. సోమవారం నుంచి వారం రోజుల పాటు దరఖాస్తులను స్వర్ణగ్రామ, స్వర్ణవార్డు సచివాలయాల్లో స్వీకరించనుంది. దరఖాస్తుదారుల అర్హతను నిర్ధారించేందుకు 2019 డిసెంబరులో (వైకాపా హయాంలో) జారీ చేసిన జీవో 174నే అధికారులు - మిగతా2లో

# పక్కా ప్లాన్‌తో డ్రగ్స్ నివారణ

- డ్రగ్స్ రహిత భారత్‌తోనే 'వికసిత్ భారత్' కల సాకారం
- 2029 నాటికి దేశాన్ని పూర్తిగా డ్రగ్స్ రహితంగా మార్చడమే లక్ష్యం!
- "2047 నాటికి మాదకద్రవ్యాలు లేని యువశక్తి వికసిత్ భారత్‌ను ముందుకు నడిపించాలనేది ప్రధాని మోదీ లక్ష్యం
- 2029 నాటికి డ్రగ్స్ రహిత భారతదేశమే లక్ష్యం : కేంద్ర హోంమంత్రి అమిత్ షా

5



# ఏపీ పర్యాటకానికి మహర్దశ

- స్వదేశ్ దర్శన్, ప్రసాద్ పథకాల్లో రూ.419 కోట్ల ప్రాజెక్టులకు కేంద్రం పచ్చజెండా
- అరకు, అరసవల్లి, గన్నవరం, వేదగిరి ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం ఆమోదం
- ప్రాజెక్టుల పనులకు త్వరలో టెండర్లు పిలవనున్న ప్రభుత్వం



అమరావతి, మహానగర్

ప్రకృతి సోయగానికి నిలువుటద్దం పట్టే కొండ కోనలు, సహజసిద్ధ జల పాతాలు, నదుల పరవళ్లు, విశాల సముద్ర తీరం, ప్రఖ్యాత పుణ్యక్షేత్రా లు, వైభవాన్ని చాటే చారిత్రక ప్రదేశాలు, వారసత్వానికి ప్రతీకైన కోటలు ఇలాంటి విభిన్నమైన పర్యాటక ప్రాంతాల సమాహారం ఆంధ్రప్రదేశ్. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల గొప్పతనాన్ని అందరికీ పరిచయం చేసేలా ముందుకు సాగుతోంది కూటమి ప్రభుత్వం. ఈ రంగాన్ని ఆదాయ వనరుగా మార్చుకోవడంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. ఇటీవలి కాలంలో ఈ దిశగా ముమ్మర ప్రయత్నాలు జరుగుతుండటంతో పర్యాటక ప్రాంతాల్లో వసతులు మెరుగవుతు న్నాయి. తాజాగా స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ పథకాల కింద మొత్తం రూ.419.30 కోట్లతో అరకు, అరసవల్లి, గన్నవరం, వేదగిరి ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వ ప్రతిపాదనలను కేంద్రం ఆమోదించింది. ఈ ప్రాజెక్టుల పనులకు ప్రభుత్వం త్వరలో టెండర్లు పిలవనుంది. స్వదేశ్ దర్శన్ పథకంలో రూ.152 కోట్లతో ఇప్పటికే అరకు గుహలు, సూర్యలంక బీచ్ అభివృద్ధి - మిగతా2లో



## ఐరాస వరల్డ్ మ్యాప్‌లో జమ్మూకశ్మీర్, లద్దాఖ్

- భారత్ అధికారిక పటాల ప్రకారమే ఉండాలి
- జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌ను భారత అధికారిక పటం ప్రకారమే చూపాలని భారత్ స్పష్టీకరణ
- తప్పుడు లేదా తప్పుదోవ పట్టించే చిత్రణ తమకు ఆమోదయోగ్యం కాదని వెల్లడి

5

# స్వచ్ఛ గోదావరి పవిత్ర పుష్కరాలు



- వచ్చే ఏడాది ఘనంగా గోదావరి పుష్కరాలు
- 'స్వచ్ఛ గోదావరి-పవిత్ర పుష్కరాలు' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు
- పాత రేవుల మరమ్మతులు, కొత్త రేవుల నిర్మాణం

అమరావతి, మహానగర్

వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలను వైభవంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఈ ప్రతిష్ఠాత్మక వేడుకల కోసం 'స్వచ్ఛ గోదావరి-పవిత్ర పుష్కరాలు' అనే పేరుతో ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ప్రభుత్వం అదనపు నిధులను కూడా కేటాయించింది. పంచాయతీరాజ్, గ్రామీణ తాగునీటి సరఫరా శాఖల సమన్వయంతో ముందుగా స్నానఘట్టాల (రేవుల) ప్రక్షాళన, కొత్త రేవుల నిర్మాణ పనులను - మిగతా2లో



- 'నో--బిడ్'లు తగ్గుముఖం.. కొనుగోలుదారుల పోటీతో మెరుగవుతున్న ధరలు
- వేలం కేంద్రాలను నిరంతర పర్యవేక్షణ: మంత్రి అచ్చెన్నాయుడు
- రైతులకు మెరుగైన మార్కెట్, గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం చర్యలు

# పొగాకు రైతులకు భరోసా

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో 2025--26 ఎఫ్‌సీవీ పొగాకు వేలాల్లో ఇటీవల మార్కెట్ పరిస్థితులు క్రమంగా మెరుగుపడుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలు, మార్గదర్శకత్వంతో పొగాకు రైతులకు మెరుగైన మార్కెట్, గిట్టుబాటు - మిగతా2లో

మహానగర్



# సీఎం హామీలపై ఏపీ జేఏసీ హర్షం

- ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి సానుకూల స్పందన
- పీఆర్సీ కమిటీ, రెండు డీఏలు, సరెండర్ లీవ్ బకాయిల చెల్లింపుపై హామీ
- హెల్త్ కార్డుల సమస్యల పరిష్కారానికి సీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ



విజయవాడ, మహానగర్

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఏపీ జేఏసీ చేపట్టిన ఉద్యమ కార్యాచరణకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చలు జరిపి పలు అంశాలపై సానుకూలంగా స్పందించడంపై ఏపీ జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. ఆదివారం విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో జేఏసీ చైర్మన్ ఎ. విద్యాసాగర్, సెక్రటరీ జనరల్ కె.ఎస్.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ సెప్టెంబర్ 5న జరిగిన చర్చల్లో పీఆర్సీ కమిటీ నియామకం, రెండు డీఏల విడుదల, సరెండర్ లీవ్ బకాయిల చెల్లింపు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. సుమారు నాలుగు లక్షల మంది పెన్షనర్లకు ప్రయోజనం కలిగించే నిర్ణయాలను స్వాగతిస్తున్నామని చెప్పారు. పీఆర్సీ అంశాలపై ఉపాధ్యాయ సంఘాలు తొలుత ఉద్యమం చేపట్టగా, అనంతరం ఏపీ జేఏసీ బాధ్యత తీసుకుని ఆగస్టు 26న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నోటీసు ఇచ్చిందన్నారు. అనంతరం కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు వినతిపత్రాలు అందజేశామని తెలిపారు. ఆగస్టు 31లోగా ప్రభుత్వం చర్చలకు పిలవాలని, లేకుంటే ఉద్యమ కార్యాచరణ చేపడతామని ముందుగానే స్పష్టం చేశామని, సెప్టెంబర్ 5లోగా చర్చలకు ఆహ్వానించకపోతే ఉద్యమ శంఖారావం పూరించాలని నిర్ణయించిన నేపథ్యంలో ప్రభుత్వం స్పందించడం సానుకూల పరిణామమని విద్యాసాగర్ పేర్కొన్నారు. ఉద్యోగులు, పెన్షనర్ల హెల్త్ కార్డుల సమస్యలను కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఉద్యోగులు చెల్లించే కాంట్రిబ్యూషన్‌తో పాటు ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తాన్ని ప్రతి నెల 1వ తేదీన ట్రస్ట్ ఖాతాకు పూర్తిగా బదిలీ చేయాలని కోరగా, ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ప్రతి నెల రూ.30 కోట్లకు పైగా నిధులు ట్రస్ట్‌కు క్రమం తప్పకుండా అందితే ఆసుపత్రుల బిల్లులు రెండు, మూడు రోజుల్లోనే చెల్లించే అవకాశం ఉంటుందని, తద్వారా ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు కలిపి సుమారు 24 లక్షల మందికి మెరుగైన వైద్య సేవలు అందే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హెల్త్ కార్డులకు సంబంధించిన మిగిలిన సమస్యల పరిష్కారానికి సీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. పీఆర్సీ కమిటీతో పాటు ఇంటరిమ్ రిలీఫ్ (ఐఆర్) ప్రకటించాలని కోరగా, తగిన సమయంలో ఐఆర్ అంశాన్ని పరిశీలిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను మరిన్ని సంక్షేమ పథకాల పరిధిలోకి తీసుకురావడం, వారికి ప్రయోజనం కల్పించడం, కొన్ని విభాగాల్లో పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంచే అంశాలను కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలకు సంబంధించిన ఉత్తర్వులు త్వరలో వెలువడతాయని ఆశిస్తున్నామని, హామీలు అమలు కాకపోయినా, డిమాండ్ల పరిష్కారంలో జాప్యం జరిగినా ఉద్యమ కార్యాచరణ చేపట్టడంలో వెనుకడుగు వేసేది లేదని స్పష్టం చేశారు. తదుపరి కార్యాచరణను నిర్ణయించేందుకు సెప్టెంబర్ మూడో వారంలో ఏపీ జేఏసీ రాష్ట్ర సమావేశం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఏపీ జేఏసీ సెక్రటరీ జనరల్ కె.ఎస్.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జేఏసీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు డి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 70 ఏళ్లు పైబడిన పెన్షనర్లకు అదనపు క్వాంటమ్ పెన్షన్ మంజూరు చేయడం వల్ల వృద్ధాప్య పెన్షనర్లకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. వయస్సు పెరిగే కొద్దీ వైద్య, ఇతర జీవన వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో అదనపు క్వాంటమ్ వారికి ఆర్థికంగా అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. పెన్షనర్ల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన ఏపీ జేఏసీ చైర్మన్ విద్యాసాగర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పెన్షనర్ల ఇతర సమస్యల పరిష్కారానికి కూడా ప్రభుత్వంతో చర్చలు, ప్రయత్నాలు కొనసాగిస్తామని విద్యాసాగర్, కె.ఎస్.ఎస్. ప్రసాద్, వెంకటేశ్వర్లు తెలిపారు. సమావేశంలో కె.ఎస్.ఎస్. ప్రసాద్, డి.వి. రమణ, సి.హెచ్. మంజుల, ఎ. సాంబశివరావు, డి. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# 1 నుంచి కొత్త పింఛన్లు

-మొదటిపేజీ తరువాయి

ప్రామాణికంగా తీసుకున్నారు. ఆరంచెల తనిఖీ విధానాన్ని అమలు చేయనున్నారు.
అనర్హులుగా తేలిన వారికి.. అందుకు కారణాలు తెలియజేస్తూ పత్రాన్ని అందిస్తారు.
వివిధ దశల్లో పరిశీలన అనంతరం అర్హులుగా తేలిన వారికి ప్రభుత్వం ఎప్పటికప్పుడు జారీచేసే ఉత్తర్వులకు అనుగుణంగా కేటగిరీల వారీగా, విడతల వారీగా కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నారు. వచ్చిన దరఖాస్తులు, వాటి తనిఖీ, అర్హుల ఎంపిక, ప్రభుత్వ ఆమోద ప్రక్రియ ఈ నెల 7తో మొదలై 20 రోజుల్లో ముగియనుంది. తర్వాత పింఛను మంజూరు ఉత్తర్వులు వెలువడనున్నాయి. అక్టోబరు 1 నుంచి కొత్త పింఛన్లు అందించనున్నారు.
కొత్త పింఛను దరఖాస్తు నమూనా రాష్ట్రంలోని అన్ని స్వర్ణగ్రామ, స్వర్ణవార్డు సచివాలయాల్లో (ఎస్‌జీఎస్‌డబ్ల్యూ) అందుబాటులో ఉంటుంది. ఎస్‌జీఎస్‌డబ్ల్యూ వెబ్‌సైట్, ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం అధికారిక వెబ్‌సైట్ నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
దరఖాస్తు స్వీకరణ బాధ్యతను సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్/వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శికి అప్పగించారు.
దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తర్వాత రసీదు ఇస్తారు.
దరఖాస్తులోని వివరాలను ఈకేవైసీ డేటాతో బ్యాక్‌ఎండ్‌లో సిస్టమ్ సరిపోల్చనుంది.
అన్నీ సక్రమంగా ఉంటే దరఖాస్తు తదుపరి దశకు వెళుతుంది. లేకపోతే నిలిచిపోతుంది. ఆ విషయాన్ని దరఖాస్తుదారునికి తెలియజేసి, సరైన వివరాలు సమర్పించాలని సచివాలయ సిబ్బంది సూచిస్తారు.
ఆరు అంచెల తనిఖీ విధానంలో దరఖాస్తుదారుల వివరాలను పరిశీలిస్తారు.
అనర్హులుగా తేలిన వారికి తిరస్కరణ పత్రాన్ని అందిస్తారు.
అర్హత సాధించిన దరఖాస్తులను సచివాలయ సిబ్బంది మరోసారి క్షేత్రస్థాయి తనిఖీ చేసి, నిర్ధారిస్తారు.
దరఖాస్తుదారుడి ఈకేవైసీ నమోదు కానీ పక్షంలో సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లినప్పుడు వారి నుంచి వివరాలు తీసుకుంటారు.
వృత్తిపరమైన పింఛన్ల అర్హత నిర్ధారణకు..
సచివాలయాల స్థాయిలో అర్హత సాధించిన దరఖాస్తుల్లో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పింఛన్ల దరఖాస్తులు.. ఎంపీడీవో/మున్సిపల్ కమిషనర్ లాగిన్‌కు, ఒంటరి మహిళలవి తహసీల్దారు లాగిన్‌కు వెళతాయి.
చేనేత కార్మికులు, మత్స్యకారులు, డప్పు కళాకారులు, సంప్రదాయ చర్మకారులు, హిజ్రా కేటగిరీ దరఖాస్తులను సంబంధిత శాఖల జిల్లా అధికారులకు పంపిస్తారు.
ఆయా స్థాయిల్లో అధికారుల పరిశీలన తర్వాత అవన్నీ తిరిగి ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లకు చేరతాయి. అక్కడి నుంచి అర్హత ఉన్నవాటిని కేటగిరీల వారీగా ఆయా శాఖల ఉన్నతాధికారులకు నివేదిస్తారు.
ఇక్కడ పరిశీలన తర్వాత అర్హత కలిగిన దరఖాస్తులన్నింటినీ సెర్ప్‌కు నివేదిస్తారు. అక్కడ మరోసారి పరిశీలన తర్వాత పింఛన్ల మంజూరు కోసం సంక్షేమ కార్పొరేషన్ల వారీగా బడ్జెట్ కేటాయింపునకు ప్రభుత్వానికి సమర్పిస్తారు.
ప్రభుత్వ ఆమోదం, బడ్జెట్ విడుదల/లభ్యతకు అనుగుణంగా పింఛన్లు మంజూరు చేస్తారు.

**ఉత్తర్వులు అందిన నెల నుంచే పింఛను**

సెర్ప్ ఏ నెల నుంచి మంజూరు ఉత్తర్వులు జారీ చేస్తుందో.. అప్పటి నుంచే పింఛను అందనుంది. అంతేగానీ దరఖాస్తు చేసుకున్న తేదీ నుంచి గానీ, అర్హత వచ్చిన పాత తేదీ నుంచి గానీ చెల్లించరు.
అర్హత ఉన్న వారికి మంజూరు ఉత్తర్వుల్ని సచివాలయాల్లోని సంక్షేమ, విద్య సహాయకుడు, వార్డు సంక్షేమ, అభివృద్ధి కార్యదర్శి అందిస్తారు.
కొత్త పింఛన్ల దరఖాస్తుల ప్రక్రియను కలెక్టర్లు పర్యవేక్షించనున్నారు.
దరఖాస్తుకు అవసరమైన ధ్రువపత్రాలివి..
అన్ని కేటగిరీల పింఛన్ల దరఖాస్తుకు అవసరమైన పత్రాలు: ఆధార్ కార్డు, బియ్యం కార్డు/ఆదాయ ధ్రువీకరణ పత్రం
వితంతు పింఛనుకు – భర్త మరణ ధ్రువీకరణ పత్రం, భర్త ఆధార్ నంబర్
ఒంటరి మహిళ పింఛను
వివాహితులైతే: కోర్టు/అదాలత్‌లు జారీ చేసిన విడాకుల పత్రం
వివాహం కాని వారైతే: పెళ్లి కానట్లు తహసీల్దారు జారీ చేసిన ధ్రువీకరణ పత్రం
దివ్యాంగుల పింఛను – కనీసం 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నట్లు తెలిపే సదరమ్ ధ్రువీకరణ పత్రం
చేనేత పింఛను, మత్స్యకారుల పింఛను, డప్పు కళాకారుల పింఛను, సంప్రదాయ చర్మకారుల పింఛను, కల్లుగీత కార్మికుల పింఛను – సంబంధిత శాఖలు జారీ చేసిన ధ్రువీకరణ పత్రం
హిజ్రాల పింఛను– జిల్లా మెడికల్ బోర్డు జారీ చేసిన ధ్రువీకరణ పత్రం
రాష్ట్రంలో 12.88 శాతం మందికి
"అధికారం చేపట్టిన మొదటి నెల నుంచే ఇచ్చిన మాట ప్రకారం పింఛను మొత్తాన్ని పెంచాం. వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళల పింఛన్ల మొత్తాన్ని రూ.3 వేల నుంచి రూ.4 వేలకు, దివ్యాంగుల పింఛను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచి అందిస్తున్నాం. అర్హత ఉండి ఇప్పటివరకు పింఛను పొందని వారికి కూడా అవకాశం కల్పిస్తున్నాం. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్రంలో పింఛను మొత్తం, నెలవారీ, వార్షిక పింఛను వ్యయం, అన్నీ అత్యధికంగానే ఉన్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం 61.92 లక్షల మందికి పింఛను ఇచ్చేందుకు నెలకు రూ.2,693.90 కోట్ల వ్యయమవుతోంది. గత 26 నెలల్లో పింఛను కోసం రూ.73,507 కోట్లు ఖర్చు చేశాం. 2011 జనాభా ప్రాతిపదికగా రాష్ట్ర జనాభాలో 12.88 శాతం మంది పింఛన్లు తీసుకుంటున్నారు' అని ప్రభుత్వం ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించింది.

# సుదీర్ఘ పాదయాత్రకు జగన్

**కడప :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పాదయాత్ర అనేది కేవలం ఒక ప్రచార సాధనమే కాదు.. అధికార పీఠాన్ని దక్కించుకునే ఒక పొలిటికల్ మాస్టర్ స్ట్రోక్. తండ్రి వైఎస్సార్ అడుగుజాడల్లో నడిచి 2017లో సుదీర్ఘ పాదయాత్ర ద్వారా 2019లో ప్రభంజనం సృష్టించిన వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఇప్పుడు మరొకసారి అదే అస్త్రాన్ని ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని 2027 జూలై 8 నుంచి లేదా ఆ తర్వాతి నెలల్లో 2029 ఎన్నికలే లక్ష్యంగా సుదీర్ఘ పాదయాత్రను ప్రారంభించాలని జగన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఏర్పడిన మూడున్నరేళ్ల తర్వాత పూర్తిస్థాయిలో రోడ్డెక్కి, ఎన్నికల దాకా ప్రజల్లోనే ఉండటం ద్వారా ప్రజా మూడ్‌ను తమ వైపు తిప్పుకోవచ్చని వైసీపీ బలంగా నమ్ముతోంది.వైసీపీ అంచనాల ప్రకారం.. ప్రభుత్వ పదవీకాలం చివరి దశకు వచ్చేసరికి కూటమి ప్రభుత్వంపై సహజంగానే కొంత అసంతృప్తి లేదా వ్యతిరేకత మొదలవుతుంది. ఆ సమయానికే సరిగ్గా క్షేత్రస్థాయిలోకి వెళ్లి, ప్రభుత్వం ఇచ్చిన హామీల వైఫల్యాలను ఎండగడుతూ, సంక్షేమ పథకాల కొరతను ఎత్తిచూపితే ప్రజల మూడ్ వేగంగా మారుతుందనేది జగన్ వ్యూహం. గతంలో కూడా 2017 నవంబర్ నుంచి 2019 ఎన్నికల వరకు సుమారు 14 నెలల పాటు నిరంతరం ప్రజల్లో ఉండటం వల్లనే 151 సీట్ల భారీ విజయం సాధ్యమైందని, అదే సెంటిమెంట్‌ను, రాజకీయ వ్యూహాన్ని మళ్లీ పునరావృతం చేయాలని భావిస్తున్నారు.అయితే, 2017 నాటి పరిస్థితులకు, ప్రస్తుత 2027-28 నాటి రాజకీయ పరిస్థితులకు భూమికి ఆకాశానికి ఉన్నంత తేడా ఉందని చాలా మంది చెబుతున్నారు. 2017లో జగన్ ఒక నవ నాయకుడిగా , అవకాశం ఇవ్వాల్సిన కొత్త ఆశాకిరణంగా ప్రజల్లోకి వెళ్లారు. కానీ ఇప్పుడు ఆయన 5 ఏళ్ల పాలనా అనుభవాన్ని, ప్రజా తీర్పును చూసి ప్రతిపక్షంలో కూర్చున్న నాయకుడు. గతంలో తను ఇచ్చిన హామీలు, ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధి లేదా వివాదాలపై కూటమి ప్రభుత్వం ఆయనను క్షేత్రస్థాయిలోనే డిఫెన్స్‌లో పడేసే ప్రమాదం ఉంది. అప్పట్లో అలా చేశారు.. ఇప్పుడు ఇలా అడుగుతున్నారు అనే ప్రశ్నలు ఆయనకు పెద్ద సవాలుగా మారవచ్చు. మరోవైపు, అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సైతం జగన్ యాత్రను తేలికగా తీసుకునే ప్రసక్తే లేదు. నాడు చంద్రబాబు ఒంటరిగా ఉంటే, నేడు పవన్‌కల్యాణ్ తోడ్పాటు, కేంద్రంలోని బీజేపీ అండదండలు కూటమికి బలంగా ఉన్నాయి.

## స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి

-మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్సీ శ్రీకాంత్ ఉంటే.. ఎలా ఉంటుందనే విషయమై చంద్రబాబు నాయకులను ఆరా తీసినట్లు సమాచారం. కుప్పంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను జనంలోకి తీసుకెళ్లాలని సూచించారు. త్వరలోనే కుప్పంలో రెండు రోజులు పర్యటిస్తానని తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఏఎంసీ ఛైర్మన్ జీఎం రాజు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు రైతులకు భరోసా

-మొదటిపేజీ తరువాయి

ధర కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందన్నారు. తాను కూడా పొగాకు వేలం ప్రక్రియను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 4 నాటికి 132 వేలం రోజుల్లో 86.59 మిలియన్ కిలోల ఊఇఎ పొగాకు మార్కెట్ అయిందని మంత్రి తెలిపారు. ప్రస్తుత సీజన్‌కు అనుమతించబడిన పంట పరిమాణం 142 మిలియన్ కిలోలు కాగా, అంచనా ఉత్పత్తి సుమారు 236 మిలియన్ కిలోలుగా ఉందన్నారు. ఇప్పటివరకు నమోదైన సగటు ధర కిలోకు రూ.209.83గా ఉందని వెల్లడించారు. గత ఏడాది ఇదే 132 వేలం రోజుల నాటికి 140.27 మిలియన్ కిలోల పొగాకు మార్కెట్ కాగా, తుది సగటు ధర కిలోకు రూ.248.86గా నమోదైందని మంత్రి పేర్కొన్నారు. ఈ ఏడాది అధిక ఉత్పత్తి కారణంగా మార్కెట్‌లో సర్ప్లస్ ఏర్పడటంతో కొంత ఒత్తిడి నెలకొన్నప్పటికీ, ఇటీవల వేలాల్లో కొనుగోలుదారుల స్పందన, పోటీ గణనీయంగా మెరుగుపడుతున్నాయని తెలిపారు. ఇటీవల వేలం కేంద్రాల్లో 'నో--బిడ్' బేల్స్ శాతం గణనీయంగా తగ్గిందని అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రస్తుతం రోజువారీగా సగటున 11--12 శాతం వరకు 'నో--బిడ్'లు నమోదవుతున్నాయని, కొన్ని వేలం ప్లాట్‌ఫారమ్‌లలో ఇది 1--2 శాతం కంటే కూడా తక్కువగా ఉందన్నారు. 'నో--బిడ్'లు తగ్గడం, కొనుగోలు కార్యకలాపాలు పెరగడం, కొనుగోలుదారుల మధ్య పోటీ మెరుగుపడటం మార్కెట్‌లో సానుకూల సంకేతాలని మంత్రి అన్నారు. ప్రస్తుతం వారానికి సుమారు 10 మిలియన్ కిలోల పొగాకు మార్కెట్ అవుతోందని తెలిపారు. కొనుగోలుదారుల మధ్య పెరుగుతున్న పోటీ మెరుగైన ధరల సాధనకు దోహదపడుతోందన్నారు. పొగాకు పంట మార్కెటింగ్ ప్రక్రియను టొబాకో బోర్డు ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులు, తయారీదారులు, ఎగుమతిదారులు, వ్యాపార ప్రతినిధులతో సమన్వయం చేస్తూ కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నామన్నారు. వేలాల్లో కొనుగోలుదారులు నిరంతరం పాల్గొనేలా చూడటం, మార్కెటబుల్ పొగాకును కొనుగోలు చేయడం, నివారించగల 'నో--బిడ్'లను తగ్గించడం, కొనుగోలు షెడ్యూల్‌ను క్రమబద్ధంగా కొనసాగించడం, పంటను త్వరితగతిన మార్కెట్ చేయడం వంటి అంశాలపై వ్యాపార వర్గాలతో చర్చలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, వ్యాపార వర్గాల ప్రతినిధులతో మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేశామని, సీనియర్ అధికారులు వేలం ప్లాట్‌ఫారమ్‌లను సందర్శిస్తూ క్షేత్రస్థాయి సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నారని మంత్రి వివరించారు.----

## ఏపీ పర్యాటకానికి మహర్దశ

-మొదటిపేజీ తరువాయి

చేయడంతోపాటు నాగార్జునసాగర్ వద్ద బుద్దిస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ నిర్మిస్తున్నారు.

**నాలుగు కొత్త ప్రాజెక్టులివే**

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో రూ.101.07 కోట్లతో అరకు కల్చరల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. కొత్తవలసలో ఐటీడీఏకు చెందిన 19.23 ఎకరాల స్థలంలో దీన్ని అభివృద్ధి చేయనున్నారు. గిరిజన సంస్కృతి, స్థానిక వంటకాలు, అరకు కాఫీ, చిరుధాన్యాల ప్రత్యేకతలను పర్యాటకులకు పరిచయం చేయనున్నారు.
శ్రీకాకుళం జిల్లాలో ప్రసిద్ధ అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ పరిసరాలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ.107.94 కోట్లతో 'అరసవల్లి సన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్' ఏర్పాటు చేయనున్నారు. నాగావళి నది ఒడ్డున ఉన్న చారిత్రక డచ్ హెరిటేజ్ భవనాన్ని పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకురానున్నారు. డిజిటల్ ప్రదర్శనలు, మ్యూజియం, హస్తకళల అనుభవాలు, తదితర సదుపాయాలతో నాగావళి రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేస్తారు.
విజయవాడ విమానాశ్రయానికి కిలోమీటర్ దూరంలో సుమారు ఐదెకరాల విస్తీర్ణంలో రూ.176 కోట్లతో 'గన్నవరం మైస్ సెంటర్' ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను పరిచయం చేసే ఇమ్మర్సివ్ థియేటర్, ప్రసిద్ధ స్వీట్లు, జ్ఞాపికల విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు.
నెల్లూరు జిల్లాలో వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని రూ.34.29 కోట్లతో ప్రసాద్ పథకం అభివృద్ధి చేయనున్నారు. పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా రాకపోకలు, క్యూల నిర్వహణ, వేచి ఉండే ప్రాంతాల్లో భక్తులకు సౌకర్యాలు మెరుగుపరచనున్నారు. టూరిస్ట్ అమెనిటీ సెంటర్, వెయిటింగ్ హాళ్లు, కొత్త అన్నదాన భవనం, వంటశాల, ప్రవేశ ద్వారం, నడక మార్గాలు, ల్యాండ్‌స్కేపింగ్, భక్తుల పార్క్, కూర్చునే ప్రదేశాలు, భద్రతా ఏర్పాట్లు కల్పించనున్నారు.
మరికొన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రతిపాదనలు : స్వదేశ్ దర్శన్ 2.0లో మరికొన్ని ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. మచిలీపట్నంలో కోస్టల్ ఎక్స్‌పీరియన్స్, మంగళగిరి ఆలయ పరిసరాల్లో పర్యాటక సదుపాయాలు, మంగళగిరి ఎకో పార్క్ అభివృద్ధి, నంద్యాల జిల్లాలో బెలూం గుహల్లో కేవ్ లైటింగ్, సందర్శకులకు సదుపాయాల కల్పన వంటివి వీటిలో ఉన్నాయి.

## స్వచ్ఛ గోదావరి-పవిత్ర పుష్కరాలు

-మొదటిపేజీ తరువాయి

చేపట్టనున్నారు.



ఉమ్మడి గోదావరి జిల్లాల్లో ప్రవహించే అఖండ గోదావరి, వశిష్ఠ, గౌతమి నదులకు కుడి, ఎడమ వైపున పుష్కర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. అక్కడ ఉన్న 238 పాత రేవులకు అవసరమైన మరమ్మతులు చేయనున్నారు.
వీటితో పాటు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కొత్తగా మరో 16 రేవులను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పనులన్నింటి కోసం రూ. 210.05 కోట్ల అంచనాతో అధికారులు టెండర్లు పిలిచారు.

**తాగునీటి సదుపాయాలు**

పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక వసతులు మెరుగుపరుస్తున్నారు. బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, పోలవరం జిల్లాల పరిధిలో రూ.90 కోట్లతో 7 నియోజకవర్గాల్లో మొత్తం 111 రోడ్లను నిర్మించనున్నారు. అలాగే, రేవుల వద్ద భక్తుల కోసం రూ.10 కోట్లతో తాగునీటి సదుపాయం కల్పిస్తారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో 30కి పైగా సిమెంటు, తారురోడ్ల నిర్మాణ పనులు కూడా చేపట్టనున్నారు.
పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల గుండా వశిష్ఠ గోదావరి ప్రవహిస్తోంది. ఇక్కడ తొలి దశలోనే రూ. 30 కోట్లకు పైగా ఖర్చు చేసి 34 రేవుల పనులను పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం 20కి పైగా గ్రామాల పరిధిలోని స్నానాల రేవులు వరద మేటలతో నిండిపోయాయి. పెదమల్లం లాంటి ప్రాంతాల్లో అయితే రేవులు పూర్తిగా పూడిపోయాయి. ప్రధానమైన నరసాపురం, దొడ్డిపట్ల, సిద్ధాంతం, కోడేరు రేవుల వద్ద మరుగుదొడ్ల సౌకర్యాలు లేవు. ఈ సమస్యలన్నింటినీ పుష్కరాల నాటికి పరిష్కరించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

**నవంబర్‌లో పనులు ప్రారంభం**

పుష్కరాల్లో స్నానాల రేవుల నిర్మాణమే కీలకం కాబట్టి ఈ పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నిర్మాణాలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ మరో వారం రోజుల్లో ముగియనుందని ఇరిగేషన్ హెడ్‌వర్క్స్ జేఈలు సుధాకర్, పవన్‌కుమార్ తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే నవంబర్ నెలలో పనులను ప్రారంభిస్తామని వారు వెల్లడించారు.

# ప్రజాసేవకు చిరునామా సుజనా చౌదరి

## పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాలయం






విజయవాడ, మహానగర్

పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు మరింత చేరువగా సేవలందించేందుకు ఎమ్మెల్యే సుజనా చౌదరి ఏర్పాటు చేసిన నియోజకవర్గ కార్యాలయం ప్రారంభమైంది. కార్యాలయాన్ని పరిశీలించిన ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అక్కడ ఏర్పాటు చేసిన వ్యవస్థను, సుజనా చౌదరి పనితీరును ప్రశంసించారు. పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి సుజనా రూపొందించిన మాస్టర్‌ప్లాన్, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. వారానికి రెండు రోజులు మాత్రమే నియోజకవర్గంలో అందుబాటులో ఉన్నప్పటికీ అభివృద్ధిలో రాష్ట్రంలోనే ముందంజలో ఉన్నారని చిన్ని పేర్కొన్నారు. ముఖ్యంగా డ్రైనేజీ, కొండ ప్రాంతాల సమస్యలపై సుజనా ప్రత్యేక దృష్టి సారించారని, ప్రజలు ఏ సమస్యతో కార్యాలయానికి వచ్చినా పరిష్కరించేలా సిబ్బంది, కార్యాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. కూటమిలోని ప్రతి ఒక్కరినీ తనవారిగా భావిస్తూ అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లే నాయకుడు సుజనా చౌదరి అని, ఆయనతో కలిసి పశ్చిమ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించి విజయవాడ మేయర్ స్థానాన్ని భారీ మెజారిటీతో కైవసం చేసుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ వర్ల రామయ్య మాట్లాడుతూ సుజనా చౌదరి గతంలో కేంద్ర మంత్రిగా, పారిశ్రామికవేత్తగా తనకు తెలుసునని, పశ్చిమ నియోజకవర్గం వంటి పేద, వెనుకబడిన ప్రాంతంలో ఆయన ఎలా పనిచేస్తారనే విషయంలో తొలుత సందేహం ఉండేదన్నారు. అయితే ఎన్నికల అనంతరం ఆయన పనితీరును గమనించిన తర్వాత తన అభిప్రాయం పూర్తిగా మారిందని చెప్పారు. పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరితో కలిసిపోయే స్వభావం సుజనాకు ఉందని ప్రశంసించారు. 175 నియోజకవర్గాల్లో పశ్చిమ నియోజకవర్గం పనితీరు ముందంజలో ఉండేలా ఆయన పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సమర్థమైన బృందంతో కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ ప్రజలకు సేవలు మరింత సులభంగా అందించాలనే ఉద్దేశంతోనే నియోజకవర్గ కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను తెలియజేసి, వాటి పరిష్కారంపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా వ్యవస్థను రూపొందించామని చెప్పారు. ప్రజాస్వామ్యంలో కుల, మత భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సేవ చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధిపై ఉందన్నారు. సమర్థత, సామర్థ్యం ఉన్న నాయకత్వానికే ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. నియోజకవర్గంలోని విద్య, వైద్య రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని, యువత ఉద్యోగాలు పొందే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. నివారణాత్మక వైద్యంపై దృష్టి సారించామని, గర్భిణులకు 2డీ ఎకో వంటి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కొండ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలతో పాటు విద్య, వైద్యం, రవాణా వంటి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గంలో మాదకద్రవ్యాల సమస్యను అరికట్టేందుకు సీసీ కెమెరాలు, డ్రోన్లు, పోలీసు శాఖ సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను ప్రజలకు అనుసంధానం చేయడంతో పాటు సీఎస్ఆర్ నిధులు, ప్రైవేటు ఆసుపత్రులు, విద్యాసంస్థల సహకారంతో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం వంటి అంశాల్లో ఎంపీ కేశినేని చిన్ని సహకారం కీలకమన్నారు. కనకదుర్గమ్మ దర్శనం భక్తులకు మరింత సులభంగా ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు నియోజకవర్గంలోని మసీదులు, చర్చిల అభివృద్ధికి కూడా పరిష్కార మార్గాలను అన్వేషిస్తామని తెలిపారు. ఏ సమస్యకైనా పరిష్కారం ఉంటుందని, సామరస్యంగా పరిష్కరించడమే ప్రజాప్రతినిధుల బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొణకళ్ల నారాయణ, స్వచ్ఛంద కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, నూర్‌బాషా కార్పొరేషన్ చైర్మన్ నాగుల్‌మీరా, దుర్గమల్లేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయభాను, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అద్దూరి శ్రీరామ్, పారిశ్రామికవేత్త కోగంటి సత్యం, జనసేన నాయకులు అన్నిశెట్టి వాసు, మండలి రాజేష్, టీడీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి బుద్ధ వెంకన్న, టీడీపీ సీనియర్ నేత వంగవీటి రాధా తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ నూతన కార్యాలయం ప్రారంభం



నందిగామ, మహానగర్

భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి స్థానిక బీజేపీ కార్యాలయం వేదికగా నిలవాలని పశ్చిమ ఎమ్మెల్యే, మాజీ కేంద్ర మంత్రి యలమంచిలి సత్యనారాయణ చౌదరి (సుజనా చౌదరి) పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీజేపీ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సుజనా చౌదరి మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా ప్రజలకు సేవలందిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. కొత్త కార్యాలయం ప్రజాసేవకు కేంద్ర బిందువుగా మారాలని, ప్రతి కార్యకర్త సేవాభావంతో ప్రజల మధ్య ఉంటూ పార్టీని బలోపేతం చేయాలని కోరారు. 1984 లోక్‌సభ ఎన్నికల్లో కేవలం రెండు స్థానాలతో ప్రారంభమైన బీజేపీ నేడు 303 స్థానాలకు చేరుకోవడం భారత రాజకీయ చరిత్రలో అసాధారణ ప్రస్థానమని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేస్తూ అంచెలంచెలుగా ఎదగాలని సూచించారు. నందిగామ బీజేపీ నాయకులు, కార్యకర్తల సమిష్టి సహకారంతోనే పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయగలిగామని తెలిపారు. ప్రజలకు అవసరమైన విద్య, వైద్య రంగాల్లో సుజనా ఫౌండేషన్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తున్నామని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అద్దూరి శ్రీరామ్ మాట్లాడుతూ బీజేపీ కోట్లాది మంది సభ్యులతో దేశంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా ఆవిర్భవించిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కష్టించి పనిచేయాలని సూచించారు. ప్రతి గ్రామం, వార్డు స్థాయి వరకు బీజేపీని విస్తరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉన్నం గిరిధర్, పోరుగంటి నరసింహారావు, కొల్లు నాగేశ్వరరావు, బర్రె శివకృష్ణారెడ్డి, సీతారామయ్య, రావూరి రమేష్, బండారు వెంకట నాగ కేదారేశ్వర శర్మతో పాటు మండల అధ్యక్షులు, ఇన్‌చార్జులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతాంగానికి జనసేన శ్రేణులు అండగా నిలవాలి

అవనిగడ్డ, మహానగర్

ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో జనసేన పార్టీ శ్రేణులు రైతాంగానికి అండగా నిలవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గ జనసేన పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను విజయవంతం చేసిన జనసైనికులు, వీరమహిళలకు కృతజ్ఞతలు తెలిపారు. పవన్ కళ్యాణ్‌పై ప్రజలకు ఉన్న నమ్మకం, విశ్వాసం జన్మదిన వేడుకల్లో స్పష్టంగా వ్యక్తమైందన్నారు. ప్రజల్లో జనసేన పార్టీ, పవన్ కళ్యాణ్‌పై ఉన్న నమ్మకం, ప్రేమాభిమానాలకు అనుగుణంగా నియోజకవర్గ పార్టీ శ్రేణులు శక్తివంచన లేకుండా పనిచేయాలని సమావేశంలో తీర్మానించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు అండగా నిలవాలని, పంటలు వేయలేకపోయిన రైతులకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేశారు. రైతులు ఇప్పటికే సాగు చేసిన పంటలను కాపాడేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని పేర్కొంటూ, అందుకు అనుగుణంగా సాగునీటి వినియోగ ప్రణాళిక రూపొందించి పంటలకు నీరందించే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల నిర్మాణానికి సాస్కి నిధులు మంజూరు చేయాలని



ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆదేశించినప్పటికీ నిధుల విడుదలలో జరుగుతున్న జాప్యంపై సమావేశం విచారం వ్యక్తం చేసింది. నిధులను త్వరితగతిన మంజూరు చేయాలని కోరుతూ తీర్మానం చేశారు. సమావేశంలో నియోజకవర్గ యువనాయకుడు మండలి వెంకట్రామ్, సీనియర్ నాయకులు బచ్చు వెంకటనాథ్ ప్రసాద్, పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, జిల్లా పార్టీ కార్యదర్శులు కొండవీటి సునీత, గాజుల శంకరరావు, పద్యాల వెంకట ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు, పూషడపు రత్నగోపాల్, పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల కమిటీ సభ్యురాలు బచ్చు కృష్ణకుమారి, ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచులు, సొసైటీ చైర్మన్లు, నీటి సంఘాల అధ్యక్షులు, డైరెక్టర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద బాధితులకు

## రెడ్‌క్రాస్, రావెళ్ల ట్రస్ట్ సాయం




ఘంటసాల, మహానగర్

మండల పరిధిలోని చిట్టూర్పులో అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమై నిరాశ్రయులైన నిరుపేద తల్లీకుమార్తెలు లుక్కా రాణి, గంజి అనూషలకు చల్లపల్లి రెడ్‌క్రాస్ సబ్ బ్రాంచ్, రావెళ్ల కృష్ణ సేవాసమితి అండగా నిలిచాయి. ఆదివారం బాధిత కుటుంబాన్ని రెడ్‌క్రాస్ ప్రతినిధులు పరామర్శించి కృష్ణాజిల్లా రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా అందిన వంటపాత్రలు, హెవీ టార్పాలిన్, రగ్గును అందజేశారు. రెడ్‌క్రాస్ సభ్యులు, వీఆర్వో పరిశ కిరణ్‌కుమార్ సహకారంతో నిత్యావసర సరుకులను కూడా అందించారు. బాధితుల పరిస్థితిని మిత్రుల ద్వారా తెలుసుకున్న రావెళ్ల కృష్ణ సేవాసమితి చైర్మన్ రావెళ్ల ఉదయ్‌కుమార్ స్థానికంగా లేకపోయినా వెంటనే స్పందించి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని రెడ్‌క్రాస్ ప్రతినిధుల ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో సీసీ తూము వెంకటేశ్వరరావు, చల్లపల్లి రెడ్‌క్రాస్ సబ్ బ్రాంచ్ చైర్మన్ నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, సభ్యులు ఆకురాతి హరిప్రసాద్, బెల్లంకొండ హరిప్రసాద్, బత్తుల ప్రసాద్, బళ్ళా మధుసూదనరావు, ఘంటసాల సభ్యుడు కావూరి సాల్మన్‌తో పాటు స్థానికులు పాల్గొన్నారు.

# నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ

విజయవాడ, మహానగర్

జిల్లా ప్రజల సమస్యలకు వేగవంతమైన, పారదర్శకమైన పరిష్కారం అందించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 7న సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయికి చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అర్జీలు సమర్పించే సమయంలో పేరు, పూర్తి చిరునామా, మొబైల్ నంబర్‌తో పాటు సమస్యకు సంబంధించిన సమగ్ర వివరాలను స్పష్టంగా పొందుపరచాలని సూచించారు. సమస్యకు సంబంధించిన ఆధార పత్రాలు, ఇతర సంబంధిత డాక్యుమెంట్లను అర్జీతో పాటు జతచేయాలని తెలిపారు. ఇదే సమస్యపై గతంలో ఫిర్యాదు చేసిన వారు తమ పాత అర్జీ రశీదు లేదా ఫిర్యాదు రశీదును వెంట తీసుకురావాలని సూచించారు. దీనివల్ల గత ఫిర్యాదు వివరాలను పరిశీలించి తదుపరి చర్యలను వేగంగా చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు తమ అర్జీల స్థితిగతులను సులభంగా తెలుసుకునేలా ప్రభుత్వం ఎస్ఎంఎస్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిందని కలెక్టర్ తెలిపారు. ఫిర్యాదు పరిష్కార ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కలెక్టరేట్‌కు వ్యక్తిగతంగా హాజరై అర్జీ సమర్పించలేని ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న 1100 టోల్‌ఫ్రీ కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. అలాగే మీకోసం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదులను నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రజలకు మరింత చేరువగా సేవలు అందించేందుకు డివిజన్, మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా అర్జీలను స్వీకరించే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు తమ ప్రాంతానికి సమీపంలోని సంబంధిత కార్యాలయాలను సంప్రదించి సమస్యలను నమోదు చేసుకోవచ్చని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ విజ్ఞప్తి చేశారు. సమస్యలకు సంబంధించిన పూర్తి వివరాలు, ఆధార పత్రాలతో అర్జీలు సమర్పించడం ద్వారా వాటిని త్వరితగతిన పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరించేందుకు వీలుంటుందని తెలిపారు. ప్రజల నుంచి అందే ప్రతి అర్జీని సంబంధిత అధికారులు పరిశీలించి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా స్థాయి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.




మహానగర్


# హిందువుల ఐక్యతే వీహెచ్‌పీ లక్ష్యం

హిందూ సమాజాన్ని సంఘటితం చేసి, సనాతన ధర్మ పరిరక్షణకు కృషి చేయాలనే మహోన్నత సంకల్పంతో విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆవిర్భవించింది. శ్రీకృష్ణ జన్మాష్టమి పవిత్ర పర్వదినంతో ముడిపడి ఉన్న విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావ దినోత్సవం ప్రతి హిందువులోనూ ధర్మచైతన్యాన్ని మేల్కొలిపే సందర్భం. ధర్మం కోసం నిలబడటం, సమాజాన్ని సంఘటితం చేయడం, బలహీనులకు అండగా నిలవడం, సత్యాన్ని కాపాడటం ప్రతి హిందువు బాధ్యత అనే స్ఫూర్తిని ఈ ఆవిర్భావ దినోత్సవం మనకు గుర్తుచేస్తున్నది. 1964లో ముంబైలో సాధుసంతులు, ధార్మిక పెద్దలు, సామాజిక నాయకులు కలిసి విశ్వహిందూ పరిషత్‌కు పురుడుపోశారు. భిన్నమైన మఠాలు, పీఠాలు, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక సంస్థలు, సాధుసంతులను ఒకే వేదికపైకి తీసుకురావడం వెనుక ఉన్న ఆలోచన అత్యంత విశాలమైనది. దేశంలోని హిందువులందరినీ ఒకే సంప్రదాయంలోకి తీసుకురావడం కాదు.. భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుతూ 'మనమంతా హిందూ సమాజానికి చెందినవారమే' అనే ఆత్మీయ భావనను బలపరచడం విశ్వహిందూ పరిషత్ ప్రధాన లక్ష్యం. సాధుసంతుల మార్గదర్శకత్వం, సమాజంలోని వివిధ వర్గాల సహకారం, కార్యకర్తల అంకితభావంతో వీహెచ్‌పీ తన ప్రస్థానాన్ని విస్తరించుకుంటూ వస్తోంది. హిందూ సమాజ చైతన్య ప్రస్థానంలో అయోధ్య శ్రీరామ జన్మభూమి ఉద్యమం ముఖ్యమైన ఘట్టం. శ్రీరామ జన్మభూమిలో భవ్యమైన శ్రీరామ మందిరం నిర్మించాలనే ఆకాంక్షను దేశవ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విశ్వహిందూ పరిషత్ ప్రముఖపాత్ర పోషించింది. దీర్ఘకాలిక న్యాయ, సామాజిక, ప్రజా ప్రక్రియల అనంతరం అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణం సాకారం కావడం కోట్లాది హిందువుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచింది.

విశ్వహిందూ పరిషత్ దశాబ్దాలుగా సేవ, సంస్కారం, సమరసత, ధర్మజాగరణ, గోరక్షణ, దేవాలయ పరిరక్షణ, సామాజిక చైతన్యం వంటి అనేక రంగాల్లో పనిచేస్తోంది. సమాజంలో అవసరమైన వర్గాలకు విద్య, వైద్యం, సేవా కార్యక్రమాలు అందించడం, గిరిజన మారుమూల ప్రాంతాల్లో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం వీహెచ్‌పీ ప్రధాన బాధ్యత. విపత్తుల సమయంలో బాధితులకు సహాయం చేయడం వంటి కార్యక్రమాల ద్వారా పరిషత్ సేవా భావాన్ని ముందుకు తీసుకెళ్తోంది. హిందూ సమాజంలో ఏ వర్గం వెనుకబడినా అది మొత్తం సమాజం వెనుకబడినట్లేననే భావనతో సామాజిక సమరసతకు ప్రాధాన్యం ఇవ్వడం అవసరం. కుల, ప్రాంత, భాషా భేదాలకు అతీతంగా ప్రతి హిందువూ పరస్పరం సోదరభావంతో మెలగాలి. ఇదే సనాతన ధర్మం మనకు నేర్పే మానవీయ విలువ. నేడు హిందువులు ప్రపంచంలోని అనేక దేశాల్లో నివసిస్తున్నారు. విదేశాల్లో జన్మించిన హిందూ యువతరానికి భారతీయ సంస్కృతి, కుటుంబ విలువలు, పండుగలు, సంప్రదాయాలు, దేవాలయాలు, ధార్మిక వారసత్వం గురించి అవగాహన కల్పించడం ఒక ముఖ్యమైన బాధ్యత. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూ సమాజాన్ని అనుసంధానించే వేదికగా విశ్వహిందూ పరిషత్ పాత్ర మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకుంటోంది. 'ప్రపంచంలో ఎక్కడ హిందువు ఉన్నా.. అతని సాంస్కృతిక మూలాలు భారతీయ సనాతన సంప్రదాయంతో అనుసంధానమై ఉండాలి' అనే భావనను బలపరచడం అవసరం. భారత భవిష్యత్తు యువత చేతుల్లో ఉంది. సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక విద్యతో పాటు మన సంస్కృతి, చరిత్ర, కుటుంబ విలువలు, దేశభక్తి, సేవాభావం, ధర్మబద్ధమైన జీవన విధానం గురించి కూడా యువత తెలుసుకోవాలి. ధర్మం అంటే కేవలం దేవాలయానికి వెళ్లడం లేదా పూజలు చేయడం మాత్రమే కాదు. ధర్మం అంటే సత్యం, న్యాయం, కర్తవ్యం, సేవ, త్యాగం, పరస్పర గౌరవం, సమాజం పట్ల బాధ్యత. ఈ విశాలమైన ధర్మ భావనను యువతలో పెంపొందించడమే నేటి అవసరం. హిందూ సమాజంలోని ప్రతి కుటుంబం ధర్మం పట్ల అవగాహన కలిగి ఉండాలి. ప్రతి గ్రామంలో ధర్మచైతన్యం పెరగాలి. ప్రతి యువకుడిలో సేవాభావం పెంపొందాలి. ప్రతి కుటుంబంలో సంస్కారం బలపడాలి. ప్రతి హిందువు మరో హిందువును తన సోదరుడిగా భావించే పరిస్థితి ఏర్పడాలి. శ్రీకృష్ణుడు గీతలో చేసిన కర్తవ్యబోధనే మనకు మార్గదర్శకం. ధర్మం కోసం పనిచేసే ప్రతి వ్యక్తి, సమాజ సేవలో పాల్గొనే ప్రతి కార్యకర్త, సంస్కృతి పరిరక్షణకు కృషి చేసే ప్రతి కుటుంబం... హిందూ సమాజ భవిష్యత్తుకు ఒక బలమైన పునాది. ఈ పవిత్ర శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా, విశ్వహిందూ పరిషత్ 62వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని "హిందవః సోదరాః సర్వే" (హిందువులందరూ సోదరులే) అనే భావంతో హిందూ సమాజం మరింత సంఘటితం కావాలని, సనాతన ధర్మం శాశ్వత విలువలను ప్రపంచానికి మరింత బలంగా చాటాలని మనమందరం సంకల్పిద్దాం.

# వాతావరణ మార్పుతో జీవన విధ్వంసం



వాతావరణ మార్పులు, ప్రతికూల ప్రభావాలు ప్రస్తుతం స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రాణాంతకంగా కరిగిపోతున్న హిమాలయ హిమానీనదాల నుంచి కేరళలోని పశ్చిమ కనుమల్లో కొండచరియలు విరిగిపడుతున్న ఘటనల వరకు చూస్తూనే ఉన్నాం. మరోవైపు ప్రజలు వినియోగిస్తున్న వివిధ పరికరాల ద్వారా వాతావరణంలో కర్బన ఉద్గారాలు పెరిగిపోతున్నాయి. దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా కూడా సామాన్య కుటుంబాలతో పోల్చితే, సంపన్న కుటుంబాలే కర్బన ఉద్గారాలను ఏడు రెట్లు ఎక్కువ విడుదల చేస్తున్నాయని అధ్యయనాలు చెప్తున్నాయి. ఫలితంగా సమాజంలోని అందరి జీవితాలను దెబ్బతీస్తున్నాయి. అధికంగా కర్బన ఉద్గారాలను విడుదల చేస్తున్న సంపన్న కుటుంబాలు తమ జీవనశైలిని మార్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాయా? అనే ప్రశ్న ఇప్పుడు తలెత్తుతున్నది.పర్యావరణ ఉత్పత్తులు వాడండి భూమి నుంచి బయటకు వెళ్లాల్సిన వేడికి ఆటంకం ఏర్పడటం ద్వారా భూమి ఉపరితల సగటు ఉష్ణోగ్రత పెరుగడాన్ని భూతాపం (గ్లోబల్ వార్మింగ్) అంటారు. బొగ్గు మండించడం ద్వారా ఉత్పత్తయ్యే కర్బన ఉద్గారాలు, అడవుల నరికివేతతో ఏర్పడే గ్రీన్‌హౌస్ వాయువులు భూమి నుంచి బయటకు వెళ్లాల్సిన వేడికి ఆటంకం కలిగిస్తుంటాయి. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ మార్పుపై ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ (ఐపీసీసీ) శాస్త్రవేత్తలు, నిపుణుల అధ్యయనంలో కీలక విషయాలను గుర్తించారు. వందేండ్లలో భూమి ఉపరితల సగటు ఉష్ణోగ్రత 1.1 సెల్సియస్ పెరిగిందని నిర్ధారించారు. ఇందులో 1.07 సెల్సియస్ ఉష్ణోగ్రత పెరుగుదలకు మనుషుల కార్యకలాపాలే కారణమని అంచనావేశారు.వాతావరణ సమాచారం సేకరించండి ముఖ్యంగా 1970 తర్వాత ఉష్ణోగ్రతల పెరుగుదల రేటు మరింత వేగవంతమైందని గుర్తించారు. వాతావరణ మార్పుతో సముద్ర మట్టంతోపాటు సముద్ర ఉపరితల, పెద్ద సరస్సుల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. భారీ వర్షపాతం కారణంగా వరదలు సంభవిస్తున్నాయి. కరువు పరిస్థితులు తీవ్రమై పంటలు ఎండిపోతున్నాయి. పర్యావరణ వ్యవస్థల్లో ప్రతికూల మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల హిమాలయాల్లో హిమానీనదాల క్షీణత తీవ్రం కావడమే ఇందుకు నిదర్శనం. భూతాపంతో పెనుతుఫాన్‌లు అంతకంతకూ ఎక్కువగా, అధిక తీవ్రతతో సంభవిస్తుంటాయి. వేడి గాలులు తరచుగా, ఎక్కువ తీవ్రతతో వీచడం వంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మానవ ఆరోగ్యం మీద ప్రభావం చూపుతున్నాయి. వాతావరణ మార్పుల వల్ల సున్నితమైన హిమాలయ పర్యావరణ వ్యవస్థ వేగంగా అస్థిరమవుతున్నది. హిమానీనదాల క్షీణతతో కోట్లాది మంది జీవనోపాధికి, నీటి భద్రతకు ముప్పు సంభవించే ప్రమాదం పొంచి ఉన్నది. హిమాలయాల్లో ఉద్భవించే ప్రధానమైన సింధు, గంగా, బ్రహ్మపుత్ర నదుల ప్రవాహంలో తీవ్ర హెచ్చుతగ్గులు ఏర్పడుతున్నాయి. నదీ ప్రవాహాల్లోని అస్థిరతల వల్ల వ్యవసాయం, తాగునీటి సరఫరాపై ప్రతికూల ప్రభావం పడుతున్నది. పర్వతాలు, మైదాన ప్రాంతాల్లో నివసించే ప్రజలు నిరాశ్రయులయ్యే ప్రమాదంలోకి నెడుతున్నది. ఈ నేపథ్యంలోనే నదులను అనుసంధానం చేసే కార్యక్రమాలను కూడా చాలా జాగ్రత్తగా పరిశీలించాల్సి ఉన్నది. గ్లోబల్‌క్లైమేట్ రిస్క్ ఇండెక్స్-2021 ప్రకారం వాతావరణ మార్పుల వల్ల అత్యధికంగా ప్రభావితమవుతున్న ప్రపంచంలోని టాప్ 10 దేశాల్లో భారత్ కూడా ఒకటి. మరోవైపు లండన్‌కు చెందిన అంతర్జాతీయ థింక్ ట్యాంక్ ఓవర్సీస్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ 2021 జూన్‌లో 'ది కాస్ట్స్ ఆఫ్‌క్లైమేట్ చేంజ్ ఇన్ ఇండియా' పేరుతో విడుదల చేసిన నివేదిక కూడా సంచలన అంశాలను బయటపెట్టింది. వాతావరణ మార్పుల కారణంగా 2100 నాటికి భారత్ ఏటా జీడీపీలో 3 నుంచి 10 శాతం వరకు కోల్పోయే ప్రమాదం ఉన్నదని స్పష్టంచేసింది. 2040 నాటికి పేదరిక రేటు 3.5 శాతం పెరుగవచ్చని పేర్కొన్నది. వాతావరణ మార్పుల కారణంగా సంభవించే ప్రమాదాలతో ఖర్చులు, సమాజంలో అసమానతలు, పేదరికం కూడా పెరుగుతాయని ఈ నివేదిక వివరించింది. జీవనశైలిలో వస్తున్న మార్పుల కారణంగా భారత్‌లో ఏటా గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు నిరంతరం పెరుగుతున్నాయి.కెమిస్ట్రీ కోర్సులు నేర్చుకోండి

సమస్యను భిన్న కోణాల్లో పరిశీలించడానికి కార్బన్ ఫుట్‌ప్రింట్ విధానం ఒక మార్గంగా పనికొస్తుంది. కార్బన్ ఫుట్‌ప్రింట్ అంటే ఒక వ్యక్తి, సమాజం, కార్యక్రమం, సంస్థ, సేవ లేదా ఉత్పత్తి కారణంగా వెలువడే మొత్తం గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు. ఇందులో కార్బన్ డయాక్సైడ్, మీథేన్ కూడా ఉన్నాయి. ఇక కార్బన్ డయాక్సైడ్‌ను అత్యధికంగా విడుదల చేసే పది దేశాలు ఇవి. చైనా (9.3 జిగా టన్నులు-జీటీ), అమెరికా (4.8), భారత్ (2.2), రష్యా (1.5), జపాన్ (1.1), జర్మనీ (0.7), దక్షిణ కొరియా (0.6), ఇరాన్ (0.6), కెనడా (0.5). అయితే, తలసరి ఉద్గారాలను పరిశీలిస్తే భారత్ ప్రపంచ సగటు కంటే చాలా దిగువన ఉన్నది.

ప్రపంచవ్యాప్తంగా వెలువడే మొత్తం ఉద్గారాల్లో భారత్ వాటా 7.1 శాతం కాగా, భారత్‌లో తలసరి ఉద్గారాలు సుమారు 2.47 టన్నులుగా ఉన్నది. ఇది ప్రపంచ తలసరి సగటు 6.45తో పోలిస్తే చాలా తక్కువ. ఇక్కడ కూడా అభివృద్ధి చెందిన దేశాలకు, భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు మధ్య చాలా వ్యత్యాసం ఉన్నది. రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమానిటీ అండ్ నేచర్ ఇటీవల నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం, భారత్‌లో అధికంగా ఖర్చు చేసే సంపన్న కుటుంబాలు, దిగువ స్థాయి కుటుంబాల కంటే దాదాపు ఏడు రెట్లు ఎక్కువగా కార్బన్ ఉద్గారాలను విడుదల చేస్తున్నాయి. దేశంలోని వివిధ సామాజిక-ఆర్థిక వర్గాల్లో అత్యధిక ఉద్గారాలకు కారణమవుతున్న వ్యయాల్లో ఆహారం, విద్యుత్తు రెండు ప్రధాన రంగాలని అధ్యయనం గుర్తించింది. వాతావరణ మార్పులకు తక్కువ కారణం అయినప్పటికీ సామాన్యులు ఎక్కువగా నష్టపోతున్నారు. అందువల్ల, ప్రస్తుత ప్రపంచంలో భూతాపాన్ని ఎదుర్కొనేందుకు సుస్థిరమైన పరిష్కారాలు అత్యంత కీలకం. వాతావరణ మార్పులతో ప్రతికూల పరిస్థితులు ఏర్పడకుండా రెండు విధానాలను అనుసరించాల్సిన అవసరమున్నది. గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను, వాతావరణ మార్పుల పరిణామాల వల్ల ఎదురయ్యే ప్రమాదాలను తగ్గించడం ద్వారా సమస్యను అధిగమించవచ్చు. సమస్య పరిష్కారానికి తగిన విధానాలను ప్రజలు నిత్య జీవితంలో ఆచరణలో పెట్టినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయి.పర్యావరణ ఉత్పత్తులు వాడండి అలాగే సమాజంలో ఆధునిక సాంకేతికత, సేవ లు, ఆర్థిక వృద్ధి, అభివృద్ధి ఒకవైపు ఉండగా, మరోవైపు పేదరికం, పోషకాహార లోపం, ఆరోగ్య సమస్యలు, సామాజిక వెలివేత, వనరుల క్షీణత సమస్యలు పీడిస్తున్నాయి. ఇది సమాజంలోని తీవ్రమై న వైరుధ్యానికి నిదర్శనం. కాబట్టి పరిష్కార మా ర్గాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, భాగస్వాములను చేసే విషయంలో ప్రభుత్వాలు, పార్టీలు ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోవాలి.

# కొత్త రాహుల్, పాత కాంగ్రెస్!

పక్షం రోజుల క్రితం నేను పూణేలో ఉన్నాను. ఒక అసాధారణ దృశ్యం నా కళ్లను కమ్మివేసింది. ఎటుచూసినా ఒకే వ్యక్తి ముఖం. ఆ వ్యక్తి రాహుల్‌గాంధీ. భారతీయ జనతా పార్టీ పాలనలో ఉన్న ఒక రాష్ట్రంలో, అందునా కాంగ్రెస్ పునరుజ్జీవ సూచనలు ఏ మాత్రం కనిపించని మహారాష్ట్రలో దేశ ప్రతిపక్షనేతకు ఏమిటీ ప్రాధాన్యం?

యువ భారతీయులతో సంభాషించేందుకు రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'ఛాత్రోంజ్ కి గూంజ్' కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 22న పూణేలో సభ జరిగిన సందర్భమది. స్థానిక కాంగ్రెస్ శ్రేణులు భూమ్యాకాశాలను ఏకం చేసి రాహుల్ సభకు ప్రచారం కల్పించారు. జెన్ జీ తరం యువతులను లక్ష్యంగా చేసుకుని నిర్వహించిన ఆ సభలో రాహుల్ ఇలా అన్నారు: 'మీకు మీ తండ్రితో, సోదరుడితో, భర్తతో, కుమారుడితో అనుబంధం ఉండవచ్చు. అయితే మీరు వాళ్లకు చెందినవారు మాత్రమే కాదు. మీరు మీకు మాత్రమే చెందుతారు. మీపై పురుషుల పెత్తనాన్ని, నియంత్రణను ఎంతమాత్రం భరించవద్దు. పితృస్వామ్యం బంధనాలను బద్దలుగొట్టండి'. స్ఫూర్తిదాయక పిలుపు అది, సందేహం లేదు. రాహుల్ రాజకీయాలతో మీరు ఏకీభవించవచ్చు లేదా విభేదించవచ్చు. మీరు కాంగ్రెస్‌ను సమర్థించవచ్చు లేదా వ్యతిరేకించవచ్చు. అయితే ఒక ప్రధాన రాజకీయ పార్టీ వేదికపై పురుషాధిపత్యాన్ని బాహాటంగా విమర్శించడం బహుశా ఇదే మొదటిసారి. ఏమైనా ఇటీవల బహిరంగ సభలలో రాహుల్ ఉపన్యాసాల బాణీ మారిందనేది స్పష్టం. పూణేలో రాహుల్ ప్రసంగాన్ని ప్రత్యక్షంగా విన్న యువతులు, మహిళలే కాదు, మాధ్యమాల ద్వారా ఆ సందేశాన్ని తెలుసుకున్న ఇతర స్త్రీలు కూడా రాహుల్‌ను సమర్థించారు, అభినందించారు. అయితే ఒక ప్రశ్న: రాహుల్ పిలుపునకు ఉత్సాహంగా స్పందించిన నవతరం యువతులలో ఎంతమంది 2029 లోక్‌సభ లేదా మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్‌కు ఓటు వేయనున్నారు? కచ్చితంగా తెలియదు. ఎందుకంటే ప్రేక్షకులు, శ్రోతలు, వీక్షకులను ఆకట్టుకోవడం వేరు, ఎన్నికలలో విజయం సాధించడం వేరు. చాలా తేడా ఉంది. రాహుల్‌కు మహిళల మద్దతు పెరిగి ఉండవచ్చుగానీ... కాంగ్రెస్ పార్టీ పరిస్థితిలో మాత్రం మార్పులేదు. ఇప్పటికైతే ఆ మార్పు కనిపించడమే లేదు. అందుకు కారణమేమిటో చెబుతాను. పూణే తరువాత కొద్ది రోజులకు గోవా వెళ్లాను. ఇదీ బీజేపీ పాలనలో ఉన్న రాష్ట్రమే. వచ్చే ఏడాది ప్రథమార్ధంలోనే ఎన్నికలకు వెళ్లనున్నది. అయినా కూడా అక్కడ కాంగ్రెస్ వ్యవహారాలు ఎన్నికల సమర సన్నద్ధంగా లేవు. ప్రధాన ప్రత్యర్థిపై కంటే తనపై తానే అంతర్గతంగా పోరాడుకోవడంలో కాంగ్రెస్ నిమగ్నమై ఉంది. బీజేపీని ఓడించితీరాలనే లక్ష్యం కాంగ్రెస్‌కు దృఢంగా ఉంటే అందుకు ఒక విశాల రాజకీయ సంకీర్ణాన్ని నిర్మించడం అత్యవసరం. మరి కాంగ్రెస్ ఆ దిశగా ఆలోచిస్తున్నదా? లేదు. జాతీయస్థాయిలో ప్రతిపక్షాల సమైక్యత గురించి కాంగ్రెస్ విశేషంగా మాట్లాడుతోంది. అయితే ప్రతి రాష్ట్రంలోనూ సంస్థాగత ఐక్యత నెలకొల్పుకోవడానికి ఆ పార్టీ నానా ప్రయాసలుపడుతోంది. కర్ణాటకకు వెళదాం. కాంగ్రెస్ పాలనలో ఉన్న పెద్ద రాష్ట్రాలలో అదీ ఒకటి. ఆ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు కార్యకర్తల బలం అమితం. ప్రజల మద్దతు కూడా బాగా ఉంది. ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పార్టీకి కొత్త జవసత్వాలు సమకూర్చారు. అయితే ఆయన మంత్రి మండలిని చూడండి. 33 మందిలో ఒక్క మహిళ కూడా లేరు! రాహుల్‌గాంధీ పూణేలో యువతుల ముందు నిలబడి మహిళా సాధికారత, సమాన అవకాశాలు, పితృస్వామ్య నియంత్రణ వ్యవస్థలను బద్దలుకొట్టడం గురించి భావోద్వేగంతో మాట్లాడారు కదా. మరి కాంగ్రెస్ ప్రభుత్వాల పరిపాలనా పద్ధతుల్లో ఆ ఉదాత్త సందేశం ప్రతిబింబించకపోతే ఎలా? ఈ ఆచరణరాహిత్యమే కాంగ్రెస్‌కు అతిపెద్ద సమస్య. దేశాభ్యుదయం గురించి కాంగ్రెస్ నాయకులు సరైన విషయాలనే మాట్లాడుతున్నారు. అయితే ముఠాల కలహాలతో శిథిలమైన ఆ జాతీయ పార్టీ తన మాటలను చేతల్లో చూపించలేకపోతోంది. పంజాబ్‌కు వెళదాం. ఈ రాష్ట్రంలోనూ కొద్దినెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ముఠాల కుమ్ములాటలు మరింతగా పెచ్చరిల్లుతున్నాయి. పంజాబ్‌లోనే కాదు, ప్రతి రాష్ట్రంలోనూ కాంగ్రెస్ కథ అదే తీరులో ఉన్నది. ప్రత్యర్థి బీజేపీకి వ్యతిరేకంగా ప్రయోగించవలసిన రాజకీయ శక్తి సామర్థ్యాలు నాయకుల అంతర్గత కలహాలతో వ్యర్థమైపోతున్నాయి. కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణాలలో కూడా పురుషుల ప్రాబల్యమే స్పష్టంగా కనిపిస్తున్నది. 2022లో ఉదయ్‌పూర్ చింతన్ శిబిర్‌లో చేసిన వాగ్దానాలు ఏమిటో గుర్తుచేసుకోండి. యువ నాయకులకు మరింత ప్రాతినిధ్యం కల్పిస్తామన్న ఆ హామీ నెరవేరిందా? పార్టీ, దాని అనుబంధ సంఘాల పదవులలో యాభై ఏళ్ల వయసులోపు వారినే అత్యధికంగా నియమించేందుకు ఉదయ్‌పూర్‌లో నిర్ణయం తీసుకోలేదూ? ఈ నిర్ణయాన్ని అమలుపరిచారా? ఓబీసీలు, దళితులు, ఆదివాసీలకు మరింత కీలక భాగస్వామ్యం కల్పిస్తామని కూడా అక్కడ హామీపడ్డారు. ఈ వాగ్దానం ఏ మేరకు నెరవేరింది? ఇది, ప్రజలకు కాంగ్రెస్ కనిపిస్తున్న తీరుకు సంబంధించిన ప్రశ్న కాదు. విశ్వసనీయతకు సంబంధించిన ప్రశ్న. అలనాటి భారతదేశ పరిస్థితులకు అనుగుణంగా మాత్రమే కాంగ్రెస్ వ్యవహారాలు ఇప్పటికీ నడుస్తున్నాయి. ఈనాటి భారతదేశం పూర్తిగా భిన్నమైనది. ఈ నవ రాజకీయ భారతదేశాన్ని విశ్వసించాలని యువ ఓటర్లకు చెప్పగలిగే నైతిక అర్హత కాంగ్రెస్‌కు ఉన్నదా? మోదీ--అమిత్ షాల నేతృత్వంలోని బీజేపీ ఇటీవలి దశాబ్దాలలోని ఎన్నికలలో అప్రతిహతంగా విజయాలు సాధిస్తున్న మహాశక్తిమంతమైన రాజకీయ వ్యవస్థ. కేవలం ప్రసంగాలతో ఆ వ్యవస్థను ఎదుర్కొని విజయం సాధించగలగడం కల్ల.

అయితే ఇక్కడ రాహుల్‌గాంధీకి కొంత ఘనత దక్కాలి. గత కొన్ని సంవత్సరాలుగా ఆయన యువ భారతీయుల ఆవేదన, ఆందోళన, ఆకాంక్షల గురించి పదే పదే మాట్లాడుతున్నారు. యువత సమస్యల పట్ల సానుభూతి మాత్రమే కాదు, స్పష్టమైన అవగాహన కూడా ఆయన మాటల్లో వ్యక్తమవుతోంది. నిరుద్యోగం, అసమానతలు, సంపద కేంద్రీకరణ, పోటీ పరీక్షల ఒత్తిడి, కుంచించుకుపోతున్న ఉద్యోగ మార్కెట్... ఇత్యాది విషయాలలో సమాజంలో సర్వత్రా అసంతృప్తి ఉంది. ప్రధాన స్రవంతికి చెందిన మరే రాజకీయ నాయకుడి కంటే రాహులే ఆ అసంతృప్తిని ఎక్కువగా పట్టించుకుంటున్నారు. దానిని తొలగించేందుకు శ్రద్ధ చూపుతున్నారు. ఇది ప్రజలు గుర్తించిన వాస్తవం. మరి, యువ భారతీయులతో తాను మాట్లాడే విధానాన్ని రాహుల్ మార్చుకోగలిగినప్పుడు కాంగ్రెస్ తన పనితీరును ఎందుకు మార్చుకోలేకపోతోంది?

# కుప్పకూలిన హాస్టల్ భవనం

దేశ రాజధానిలో ఘోర విషాదం జరిగింది. దిల్లీ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ సమీపంలోని సత్య నికేతన్‌లో ఐదంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఇందులో బాలుర పీజీ వసతి గృహం నిర్వహిస్తున్నారు. ఈ ఘటనలో ఇప్పటి వరకు ఐదుగురు మృతి చెందారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. భవన శిథిలాల కింద పలువురు విద్యార్థులు చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. శిథిలాల కింద ఎంతమంది చిక్కుకున్నారు, ప్రమాదానికి గల కారణాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, బేస్‌మెంట్‌తో పాటు ఐదు అంతస్తులు ఉన్న ఈ భవనం సుమారు 50 ఏళ్ల క్రితం నాటిది. ప్రమాదం జరిగిన సమయంలో బేస్‌మెంట్‌లో మరమ్మతు, నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం సుమారు 1.30 గంటల సమయంలో ఒక్కసారిగా భవనం కుప్పకూలింది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో బేస్‌మెంట్‌లో నీరు చేరి పునాది బలహీనపడటంతోనే భవనం కూలిపోయి ఉండొచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రమాదానికి కచ్చితమైన కారణం ఇంకా తెలియలేదు. భవనం కూలిన వెంటనే దిల్లీ పోలీసులు, ఎన్‌డీఆర్‌ఎఫ్, దిల్లీ ఫైర్ సర్వీస్, డీడీఎంఏ బృందాలు ఘటనాస్థలికి చేరుకున్నాయి. అగ్నిమాపక వాహనాలు, క్యాట్స్ అంబులెన్సులను రంగంలోకి దించారు.

రెస్క్యూ బృందాలు శిథిలాలను తొలగిస్తూ బాధితుల కోసం గాలింపు చేపట్టాయి. ఇప్పటివరకు 8 మందిని బయటకు తీసినట్లు పోలీసులు తెలిపారు. వారిలో ఒకరు ఆస్పత్రికి తరలించే సమయానికే మృతి చెందగా, మరొకరు చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురు ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. రెస్క్యూ చర్యల్లో గాయపడిన ఓ సిబ్బందికి చికిత్స అందించి డిశ్చార్జి చేశారు. 40 నుంచి 50 మంది వరకు శిథిలాల కింద చిక్కుకుని ఉండొచ్చని వారు అంచనా వేస్తున్నారు. 40 నుంచి 50 మంది వరకు శిథిలాల కింద చిక్కుకుని ఉండొచ్చని వారు అంచనా వేస్తున్నారు.



### విద్యార్థులతో నిండే ప్రాంతం

సత్య నికేతన్ ప్రాంతంలో ఇరుకైన వీధుల వెంట అనేక పీజీ వసతులు, హోటళ్లు, తినుబండారాల దుకాణాలు ఉన్నాయి. దిల్లీ యూనివర్సిటీకి చెందిన పలు కళాశాలలు సమీపంలోనే ఉండటంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఇక్కడ నివసిస్తుంటారు. స్థానిక దిల్లీ పోలీసు సిబ్బంది రాజెన్ ఛెత్రి తెలిపిన వివరాల ప్రకారం, కూలిపోయిన భవనంలో సుమారు 15 గదులు ఉండేవి. ఒక్కో గదిలో ఇద్దరు లేదా ముగ్గురు విద్యార్థులు ఉండేవారు. కేరళ, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఎక్కువగా ఇక్కడ ఉండేవారని తెలిపారు. మోతీలాల్ నెహ్రూ కాలేజ్, ఆత్మారామ్ సనాతన్ ధర్మ కాలేజ్, శ్రీ వెంకటేశ్వర కాలేజీల్లో చదివే విద్యార్థులు ఈ పీజీలో ఉండేవారని, ఒక్కో బెడ్‌కు సుమారు రూ.12 వేల వరకు అద్దె చెల్లించేవారని చెప్పారు.

### ఘటనాస్థలికి సీఎం, ఎల్‌జీ

ప్రమాదం సమాచారం అందుకున్న వెంటనే దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, లెఫ్టినెంట్ గవర్నర్ తారన్‌జీత్ సింగ్ సంధు, పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్, ఎంపీ బాన్సురీ స్వరాజ్ ఘటనాస్థలికి చేరుకున్నారు. సహాయక చర్యలను పరిశీలించి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పక్కనే ఉన్న భవనాన్ని ముందు జాగ్రత్తగా ఖాళీ చేయించినట్లు సీఎం రేఖా గుప్తా తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. దిల్లీ సీఎంతో పాటు పోలీస్ కమిషనర్, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ డైరెక్టర్ జనరల్‌తో మాట్లాడి పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నట్లు తెలిపారు. గాయపడిన వారికి అవసరమైన వైద్య సహాయం అందిస్తున్నారని, వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. అంతేకాకుండా తన గోవా పర్యటనను కూడా రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది.

### భవన యజమాని కోసం గాలింపు

'హాస్టల్ డేజ్' పేరుతో ఈ భవనంలో పీజీ నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. భవనం యజమాని గురుగ్రామ్‌లో ఉంటున్నట్లు వెల్లడించారు. ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. భవనం యజమాని ఆచూకీ కోసం ఏడు నుంచి ఎనిమిది ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. నిర్మాణ నాణ్యత, భవనం నిర్వహణ, బేస్‌మెంట్‌లో జరుగుతున్న పనులు తదితర అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

### స్పందించిన కాంగ్రెస్

ఈ ఘటనపై కాంగ్రెస్ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. గాయపడిన వారికి తక్షణమే చికిత్స అందేలా చూడాలని కోరారు. ఈ కష్ట సమయంలో బాధితులకు, వారి కుటుంబాలకు అండగా ఉంటారని హామీ ఇచ్చారు. కళాశాలలు, విశ్వవిద్యాయాల్లో మంచి హాస్టళ్లు లేకపోవడంతో విద్యార్థులు ఇలాంటి పరిస్థితుల్లో నివసించాల్సి వస్తోందని అన్నారు. ప్రతివిద్యార్థి ప్రాణం అమూల్యమైనది, రక్షణ కల్పించాలని ఎక్స్?లో పోస్ట్ చేశారు.

# పక్కా ప్లాన్‌తో డ్రగ్స్ నివారణ

డ్రగ్స్ రహిత భారత్‌తోనే 'వికసిత్ భారత్' కల సాకరమవుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. 2029 నాటికి దేశాన్ని పూర్తిగా డ్రగ్స్ రహితంగా మార్చేందుకు కేంద్రం స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసిందని వెల్లడించారు. గోవా పర్యటనలో భాగంగా ఆ రాష్ట్ర సీఎం ప్రమోద్ సావంత్‌తో అమిత్ షా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మాట్లాడిన అమిత్ షా, నక్సలిజాన్ని దేశం నుంచి ఏ విధంగా నిర్మూలించామో, అదే రీతిలో మత్తుపదార్థాల ముప్పును కూడా పూర్తిగా తుడిచిపెడతామని ధీమా వ్యక్తం చేశారు. "2047 నాటికి మాదకద్రవ్యాలు లేని యువశక్తి వికసిత్ భారత్‌ను ముందుకు నడిపించాలనేది ప్రధాని మోదీ లక్ష్యం. 2014 కంటే ముందు, నార్కోటిక్స్ (మాదక ద్రవ్యాల)పై పోరాటం చాలా వరకు చిన్న చిన్న విభాగాలుగు, ఒంటరిగానే సాగింది. అప్పట్లో ఏజెన్సీలు చిన్న చిన్న నిందితులను పట్టుకోవడంతోనే సరిపెట్టుకునేవి. కానీ మా ప్రభుత్వం ఈ పోరాటాన్ని జాతీయ భద్రతకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన అంశంగా తీసుకుంది" అని అమిత్ షా అన్నారు. 2029 నాటికి మాదకద్రవ్య రహిత భారతే మా లక్ష్యం. అందుకే డ్రగ్స్ అక్రమ రవాణా, నిధుల సమీకరణ నుంచి పునరావాసం వరకు మొత్తం మాదక ద్రవ్యాల నెట్?వర్క్?ను నిర్మూలించడానికి కేంద్రం ఒక పక్కా వ్యూహాన్ని అవలంబిస్తోంది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక మాదక ద్రవ్యాల నిరోధక టాస్క్‌ఫోర్స్‌లను (ఏఎన్‌టీఎఫ్) ఏర్పాటు చేశాం. స్థానిక పోలీసులను జాతీయ వ్యూహంతో అనుసంధానించాం. అంతేకాదు మాదక ద్రవ్యాల నియంత్రణ బ్యూరో కేడర్?ను పునర్వ్యవస్థీకరించి, దాని



సిబ్బందిని, కార్యాచరణ సామర్థ్యాలను పెంచడం ద్వారా బలోపేతం చేశామని అమిత్?షా చెప్పారు. "మా ప్రభుత్వం మాదక ద్రవ్యాల నిరోధక ప్రచారం చేస్తుంది. అవగాహన, చికిత్స, కౌన్సిలింగ్, పునరావాసం, జీవనోపాధి అవకాశాలను అనుసంధానిస్తాం. అంతేకాదు డ్రగ్స్?కు బానిసలైన వ్యక్తులకు మద్దతు ఇవ్వడానికి 1933 మానస్ హెల్ప్?లైన్?ను ప్రవేశపెట్టాం. ఈ రాజకీయ సంకల్పం, సమన్వయంతో కూడిన చర్యలతో 2029 నాటికి మాదకద్రవ్య రహిత భారత్?ను సాధించడమే లక్ష్యంగా మోదీ సర్కార్ పనిచేస్తోంది" అని అమిత్? షా స్పష్టం చేశారు.

### మా పాలనలో కశ్మీర్ ప్రశాంతం!

ప్రధాని మోదీ హయాంలో జమ్ముకశ్మీర్ ఉగ్రవాదం తగ్గుముఖం పట్టిందని అమిత్ షా అన్నారు. అందుకే ఇప్పుడు ఆ ప్రాంతం అభివృద్ధి సాధిస్తూ, ప్రగతి పథంలో పయనిస్తోందని అన్నారు. ఆర్టికల్? 370 రద్దు తర్వాత జమ్ముకశ్మీర్‌లో వేర్పాటువాద భావనలు తగ్గాయని ఆయన అన్నారు. దేశ అంతర్గత భద్రతను మరింత మెరుగుపర్చడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

### నక్సలిజం ఇప్పుడు గతమైపోయింది!

ఐదు దశాబ్దాలుగా దేశాన్ని పీడించిన నక్సలిజం ఇప్పుడు గతంగా మారిపోయిందని అమిత్? షా అన్నారు. "తిరుపతి నుంచి పశుపతినాథ్ వరకు 'రెడ్ (మావోయిస్టు) కారిడార్?' నిర్మించాలని కలలు కన్నవారు, నేడు ఆయుధాలు వీడి ప్రధాన స్రవంతిలో చేరారు. ఈశాన్య రాష్ట్రాలు కూడా ఇప్పుడు ప్రశాంతంగా ఉన్నాయి. అక్కడ 11వేల మందికి పైగా యువకులు ఆయుధాలు విడిచిపెట్టారు. మేము కన్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాం. మాదక ద్రవ్యాల ముప్పును కూడా అదే పద్ధతిలో ఎదుర్కొంటాం" అని అమిత్ షా స్పష్టం చేశారు.

### పరారీలో ఉన్న నేరస్తులను వెనక్కి రప్పిస్తాం!

2029 మార్చి నాటికి 100 జాతీయ, అంతర్జాతీయ నెట్?వర్క్?లను ధ్వంసం చేయడం, 100 మంది పరారీలో ఉన్న నేరస్తులను దేశానికి తిరిగి తీసుకురావడమే కేంద్రం లక్ష్యమని అమిత్ షా చెప్పారు. మార్చి 2029 నాటికి 100 జాతీయ మరియు అంతర్జాతీయ నెట్‌వర్క్‌లను ధ్వంసం చేయడం మరియు 100 మంది పరారీలో ఉన్న నేరస్తులను దేశానికి తిరిగి తీసుకురావడం కేంద్రం లక్ష్యమని షా చెప్పారు. విదేశాల్లో దాక్కున్న, పరారీలో ఉన్న నేరస్తులను తిరిగి తీసుకురావడం కోసం తమ ప్రభుత్వం మిషన్?-మోడ్ విధానంతో ముందుకు వెళ్తోందని అన్నారు. 2019 జులై నుంచి 2026 జులై మధ్య కాలంతో 36 దేశాల నుంచి 274 మంది మోస్ట్ వాంటెడ్? నేరస్థులను భారతదేశానికి తిరిగి తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు.

# ఐరాస వరల్డ్ మ్యాప్‌లో జమ్ముకశ్మీర్, లద్దాఖ్

వివిధ దేశాలు, ఖండాల విస్తీర్ణాన్ని మరింత కచ్చితంగా తెలిపేలా ఐక్యరాజ్యసమితి ఆమోదించిన ప్రపంచ పటానికి సంబంధించి భారత్ కీలక స్పష్టీకరణ ఇచ్చింది. సరికొత్త ప్రపంచ పటంలో కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్ముకశ్మీర్, లద్దాఖ్?లను భారత అధికారిక మ్యాప్ ప్రకారమే చూపించాలని స్పష్టం చేసింది. దేశ భూభాగాన్ని తప్పుగా లేదా తప్పుదోవ పట్టించేలా చిత్రీకరిస్తే దాన్ని అంగీకరించబోమని విదేశాంగ శాఖ తేల్చిచెప్పింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'జమ్ముకశ్మీర్, లద్దాఖ్ సహా భారత సార్వభౌమ భూభాగాన్ని దేశ అధికార పటం ప్రకారమే చూపాల్సి ఉంటుంది. భారత భూభాగాన్ని తప్పుగా లేదా ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా చిత్రీకరించడం తమకు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. భారత సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతపై దేశ వైఖరి స్పష్టమైనది, స్థిరమైనది. ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడేది కాదు. ఖండాల భూభాగాలను వాటి సాపేక్ష పరిమాణాలకు అనుగుణంగా చూపించే ఈక్వల్-ఏరియా మ్యాప్ ప్రొజెక్షన్లను ప్రోత్సహించాలన్న ప్రాథమిక సూత్రానికే మద్దతు ఇచ్చాం. అంతేకానీ ఏదైనా ఒక నిర్దిష్ట ప్రపంచ పటం, ప్రొజెక్షన్ లేదా దేశాల సరిహద్దుల చిత్రణను ఆమోదించినట్లు కాదు. ఈ తీర్మానం ఏదైనా నిర్దిష్ట ప్రపంచ పటాన్ని అధికారికంగా స్వీకరించడం లేదా దానికి ధ్రువీకరణ ఇవ్వడం లేదు. అంతర్జాతీయ సరిహద్దులు, వివాదాస్పద ప్రాంతాలు, ప్రాంతాల పేర్లు వంటి రాజకీయ కార్టోగ్రఫీ అంశాలను కూడా ఇది పరిష్కరించదు' అని రణధీర్? జైస్వాల్ తెలిపారు.

### పటాల రూపకల్పనపై ప్రపంచవ్యాప్తంగా చర్చ

ప్రపంచ పటాల్లో ఖండాల పరిమాణాలు, ఆకృతులను ఎలా చూపించాలన్న అంశంపై కొంతకాలంగా చర్చ జరుగుతోంది. సంప్రదాయ మర్కేటర్ ప్రొజెక్షన్‌లో భూమధ్యరేఖకు దూరంగా ఉన్న ప్రాంతాలు వాస్తవ పరిమాణం కంటే పెద్దవిగా కనిపిస్తాయన్న విమర్శలు ఉన్నాయి. దీనికి ప్రత్యామ్నాయంగా ఖండాల విస్తీర్ణాలను సాపేక్షంగా కచ్చితంగా చూపించే ఈక్వల్-ఏరియా ప్రొజెక్షన్లను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో తాజా యూఎన్ తీర్మానం తీసుకొచ్చారు. ఇది సెప్టెంబర్ 4న ఆమోదం పొందింది. కరెక్ట్? ది మ్యాప్? అనే నినాదంతో ఐరాస సర్వసభ్య సమావేశంలో ఆఫ్రికాలోని టోగో దేశం ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఈ తీర్మానానికి భారత్?తో సహా 164 దేశాలు మద్దతు తెలిపాయి. అమెరికా ఒక్కటే మాత్రం వ్యతిరేకంగా ఓటు వేసింది. ఎస్టోనియా, జార్జియా, లిథువేనియా, మోల్డోవా, సెర్బియా, ఉక్రెయిన్ ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. అయితే ఈ కొత్త ప్రపంచ పటంలో భారత్?, ఆఫ్రికాలు ప్రస్తుతానికి కంటే పెద్దగా కనిపించనున్నాయి. అమెరికా కొంత చిన్నదిగా కనిపించనుంది. అయితే దేశాల వాస్తవ సరిహద్దుల్లో ఎటువంటి మార్పులు ఉండవు. 16వ శతాబ్దంలో నౌకాయనం



కోసం రూపొందించిన మర్కేటర్ పటాన్ని ఐరాస తీర్మానం కాలం చెల్లినదిగా ప్రకటించింది. ప్రపంచ పటాన్ని మరింత కచ్చితంగా చూపే కొత్త పటాన్ని ప్రామాణికంగా ప్రకటిస్తూ ఐరాస ప్రవేశపెట్టిన తీర్మానం ఉద్దేశాన్ని మేం స్వాగతిస్తున్నాం అని ఐరాసలో భారత ప్రతినిధి రఘు పురీ పేర్కొన్నారు. తీర్మానంపై ఓటింగ్ సందర్భంగా భారత్ తన వైఖరిని స్పష్టం చేసింది. మరింత కచ్చితమైన, సమతుల్యమైన కార్టోగ్రఫీ విధానాలను ప్రోత్సహించాలన్న తీర్మానం ఉద్దేశాన్ని భారత్ స్వాగతిస్తోందని ఐరాసలోని భారత శాశ్వత మిషన్ ఫస్ట్ సెక్రటరీ రఘు పూరీ తెలిపారు. ప్రపంచ భౌగోళిక స్వరూపాన్ని, వివిధ ప్రాంతాల పరిమాణాలను సమాజాలు ఎలా అర్థం చేసుకుంటాయన్న విషయంలో పటాలకు కీలక పాత్ర ఉందని పేర్కొన్నారు. అందువల్ల ప్రపంచ పటాల్లో భూభాగాల వాస్తవ విస్తీర్ణానికి తగిన ప్రాతినిధ్యం ఉండటం అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ తీర్మానికి మద్దతు ఇవ్వడానికి ఈక్వల్ ఎర్త్ ప్రొజెక్షన్?ను సమర్థించినట్లుగా భావించకూడదని తెలిపారు. తీర్మానాన్ని విస్తృతంగా ఈక్వల్ ఏరియా మ్యాప్? ప్రొజెక్షన్స్? వినియోగించడం, వాటిని పరిగణనలోకి తీసుకోవడాన్ని ప్రోత్సహించేదిగా మాత్రమే అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు. నిర్దిష్టంగా ఈక్వల్ ఎర్త్ లేదా మరేదైనా ఒకే పట విధానాన్ని ఆమోదిస్తున్నట్లు భావించరాదని స్పష్టం చేశారు.

## ఈ సమస్యల గురించి మాట్లాడరేం!

ప్రధాని నరేంద్ర మోదీ 'యాంగ్రీ అంకుల్' వ్యాఖ్యలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. దిల్లీ యూనివర్సిటీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో మాట్లాడిన ప్రధాని మోదీ విద్య, ఉద్యోగాలు, యువజన సంక్షేమం గురించి మాట్లాడకుండా, దానిని రాజకీయ ప్రచారంగా మార్చేశారని ఎక్స్ వేదికగా మండిపడ్డారు. జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడానికి ప్రధాని మోదీ ప్రతిపక్షాలపై రాజకీయ ముద్రలు వేస్తున్నారని విమర్శించారు. విమర్శనాత్మక ప్రశ్నలను అణచివేయడానికి, పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి విపక్షాలను కించపరిచే విశేషణాలను వాడడం ఆయనకు అలవాటుగా మారిందని ఎక్స్ వేదికగా మండిపడ్డారు. "ప్రధాని మోదీ– మీరు నిన్న దిల్లీ యూనివర్సిటీలోని ఎస్?ఆర్?సీసీని సందర్శించారు. దేశ యువత, విద్య, వారి భవిష్యత్తుపై మాట్లాడడానికి అది ఒక మంచి అవకాశం. కానీ మీరు యువత వేసే ప్రశ్నలను ఎదుర్కొనేందుకు బదులుగా, మీ ప్రసంగం కాస్త మరో రాజకీయ ప్రచారంగా మార్చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నలను అణచివేయడానికి, సొంత వైఫల్యాలను దాచడానికి మీరు ప్రతిపక్షాలకు కొత్త విశేషణాలను సృష్టిస్తున్నారు. నారాజ్ ఫూఫా (కోపదారి మేనమామ), దిమాగీ నక్సల్, అర్బన్ నక్సల్, ఖాన్ మార్కెట్ గ్యాంగ్, ఆందోళనజీవి, పరాన్నజీవి ఇలా చాలా విశేషణాలు మారుతూ ఉన్నప్పటికీ, మీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు మాత్రం మారడం లేదు."

### ఈ సమస్యల గురించి మాట్లాడరేం!

యువత రిపోర్ట్ కార్డులో పెరుగుతున్న నిరుద్యోగం, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ నియామకాలు, పేపర్ లీక్‌లు, ఖరీదైన విద్య, తగ్గిపోతున్న స్కాలర్‌షిప్ అవకాశాలు, విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిపై పెరుగుతున్న ఒత్తిడి లాంటివి ఉన్నాయని ఖర్గే పేర్కొన్నారు. "మోదీ– మీరు అందనంత దూరంలో ఉన్నప్పుడే మీకు ప్రత్యేక పరిచయ కార్యక్రమం అవసరం అవుతుంది. మోదీ తన రిపోర్టు కార్డు చూపించారు. దేశ యువత కూడా తన రిపోర్టు కార్డుతో సిద్ధంగా ఉంది. ఆ రిపోర్టు కార్డులో నిరుద్యోగం, ఏళ్ల తరబడి నిలిచిపోయిన ప్రభుత్వ నియామకాలు, పేపర్ లీక్?లతో ఇబ్బందిపడుతున్న విద్యార్థులు, రోజురోజుకూ ఖరీదు అవుతున్న విద్య, తగ్గిపోతున్న స్కాలర్‌షిప్ అవకాశాలు, యూనివర్సిటీల స్వయంప్రతిపత్తిపై పెరుగుతున్న ఒత్తిడి మొదలైనవి ఉన్నాయి. అందుకే విద్యార్థుల గొంతుక వినండి. సమస్యను పక్కదారి పట్టించడం వల్ల అవి పరిష్కారం కావు" అని ఖర్గే ఘాటు వ్యాఖ్యలు చేశారు.

### యాంగ్రీ అంకుల్స్

శనివారం ప్రధాని మోదీ శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ శతాబ్ది ఉత్సవాలను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యక్రమాలను విమర్శించేవారిపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని వ్యతిరేకించేవారిని 'యాంగ్రీ అంకుల్స్' అని అభివర్ణించారు. మోదీ ఎస్ఆర్‌సీసీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, "ఈ క్యాంపస్ వెలుపల, మీకు ఒక కొత్త ప్రపంచం కనిపిస్తుంది. మీరు రెండు రకాల వ్యక్తులను కలుస్తారు. మొదటి రకం వారు సమాజం శక్తిని దేశ శక్తిగా మార్చే వ్యక్తులు. ఇక రెండో రకం వాళ్లు ఏ పని ప్రారంభమైనా యాంగ్రీ అంకుల్‌లాగా మారిపోతారు. ప్రతి పనిని వ్యతిరేకించడమే వారి పని. వారికి ఒకే ఒక డైలాగు తెలుసు– 'దీని అవసరం ఏముంది'. మేము ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన విగ్రహాన్ని (స్టాట్యూ ఆఫ్ యూనిటీ) నిర్మిస్తున్నప్పుడు, కొందరు ఫూఫాలు (అసంతృప్తితో ఉండే బంధువులు) దీని అవసరం ఏముందని అన్నారు. మేము హైస్పీడ్ రైళ్లు, యూపీఐ ప్రారంభించినప్పుడు కూడా అలానే అన్నారు. కానీ వారందరికీ భారతదేశం తగిన సమాధానం ఇచ్చింది. దేశానికి అవసరమైన పనిని చేయడానికి భారతదేశాన్ని ఎవరూ అపలేరు" అన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోదీపై ఖర్గే విమర్శలు గుప్పించారు.

## విద్యార్థుల గొంతు వినండి



మహారాష్ట్రలో వేలాది మంది విద్యార్థులు వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారని కాంగ్రెస్ నాయకుడు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థుల సమస్యలకు కారణం కేవలం ఒక పరీక్ష లేదా నియామక ప్రక్రియ కాదని, మొత్తం వ్యవస్థపై వారికి నమ్మకం దెబ్బతినడమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం విద్యార్థుల గొంతు విని వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే 'ఛత్రోం కీ గూంజ్' (విద్యార్థుల ప్రతిధ్వని) మరింత బిగ్గరగా వినిపిస్తుందని హెచ్చరించారు. ఈ మేరకు రాహుల్ గాంధీ ఆదివారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

మహారాష్ట్రలో విద్యార్థులు శాంతియుతంగా నిరసనలు చేపడుతున్నారని రాహుల్ గాంధీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. పరీక్షలు, ఉద్యోగ నియామకాల్లో ఎదురవుతున్న సమస్యలతో వారు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇది ఒక్క అంశానికి పరిమితమైన సమస్య కాదని, విద్యా వ్యవస్థ, నియామక ప్రక్రియ, ప్రభుత్వ సంస్థలపై విద్యార్థుల్లో నమ్మకం సన్నగిల్లిందని పేర్కొన్నారు. బీజేపీ పాలనలో విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని రాహుల్ ఆరోపించారు. పేపర్ లీకులు, నియామకాలు నిలిచిపోవడం వంటి అంశాలు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని అన్నారు. అదేవిధంగా విద్యా ఖర్చులు భరించలేని స్థాయికి చేరాయని, హాస్టళ్లలో సరైన సౌకర్యాలు లేవని విమర్శించారు. హాస్టళ్లలో అమానవీయ పరిస్థితులు, నాణ్యత లేని ఆహారం వంటి సమస్యలను కూడా ఆయన ప్రస్తావించారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ)లోనూ మోసాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

"మహారాష్ట్రలో వేలాది మంది విద్యార్థులు వీధుల్లోకి వచ్చి శాంతియుతంగా నిరసన తెలుపుతున్నారు. దీనికి కారణం కేవలం ఒక పరీక్ష లేదా నియామకం కాదు. మొత్తం వ్యవస్థపై పూర్తిగా దెబ్బతిన్న విశ్వాసమే. కేంద్ర ప్రభుత్వం అయినా, రాష్ట్ర ప్రభుత్వం అయినా, ప్రతి విద్యార్థి బీజేపీ పాలన వల్ల బాధపడుతున్నారు. పేపర్ లీకులు, నిలిచిపోయిన నియామకాలు, భరించలేని విద్యా ఖర్చు, హాస్టళ్లలో అమానవీయ పరిస్థితులు, విషంలాంటి ఆహారం, డీబీటీలో మోసాలు. ఇప్పుడు ఎంపీఎస్‌సీ వంటి రాజ్యాంగబద్ధమైన సంస్థను తమ ఆధీనంలోకి తీసుకుని, దాని విశ్వసనీయతను నాశనం చేశారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం వారు చేస్తున్న ప్రతి డిమాండ్ సమర్థనీయమైనదే. ప్రభుత్వం వారి గొంతు విని తక్షణ చర్యలు తీసుకోవాలి. లేకపోతే న్యాయం జరిగే వరకు విద్యార్థుల ఈ ప్రతిధ్వని మరింత బిగ్గరగా వినిపిస్తూనే ఉంటుంది"

### ఎంపీఎస్‌సీపై తీవ్ర వ్యాఖ్యలు

మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎంపీఎస్‌సీ) వంటి రాజ్యాంగబద్ధమైన సంస్థ విషయంలోనూ రాహుల్ గాంధీ బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఎంపీఎస్‌సీని ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకుని, దాని విశ్వసనీయతను నాశనం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎంపీఎస్‌సీ నిర్వహించే పరీక్షలను ఆశ్రయించే అభ్యర్థులకు ఆ సంస్థపై నమ్మకం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తు కోసం చేస్తున్న ప్రతి డిమాండ్ సమర్థనీయమైనదేనని ఆయన అన్నారు. విద్యార్థుల ఆందోళనలను ప్రభుత్వం అణచివేయడం లేదా నిర్లక్ష్యం చేయడం కాకుండా, వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మహారాష్ట్రలో ప్రస్తుతం ఉన్న నియామక పరీక్షల విధానంపై ప్రభుత్వం సమగ్ర సమీక్ష చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకోసం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. పరీక్షా విధానాన్ని మరింత పారదర్శకంగా, సురక్షితంగా, విశ్వసనీయంగా మార్చేందుకు అవసరమైన చర్యలను ఈ కమిటీ సూచించనుంది. ప్రశ్నపత్రాల తయారీ, వాటి పరిశీలన, ప్రశ్నపత్రాల గోప్యత, సురక్షిత నిర్వహణ వంటి అంశాలను కమిటీ పరిశీలించనుంది. అలాగే పరీక్షా కేంద్రాల నిర్వహణ, భద్రత, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, అవకతవకల నివారణ వంటి అంశాలపైనా దృష్టి పెట్టనుంది.

### ఫిర్యాదుల పరిష్కారంపైనా దృష్టి

పరీక్షల నిర్వహణలో వివిధ ఏజెన్సీల మధ్య సమన్వయం ఎలా ఉండాలి? అభ్యర్థుల ఫిర్యాదులను వేగంగా ఎలా పరిష్కరించాలి? పరీక్ష రాసే అభ్యర్థులకు మెరుగైన అనుభవం కల్పించేందుకు ఎలాంటి మార్పులు చేయాలి? అనే అంశాలను కూడా కమిటీ పరిశీలించనుంది. మహారాష్ట్రలో గిరిజన విద్యార్థులు, ఉద్యోగార్థులు పలు సమస్యలపై ఆందోళనలు చేపట్టిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా హాస్టల్ పరిస్థితులు, విద్యార్థుల భద్రత, పరీక్ష పత్రాల లీకేజీలు వంటి అంశాలపై నిరసనలు జరిగాయి. విద్యార్థులు, ఉద్యోగార్థుల కీలక డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించి, పరీక్షల సంస్కరణల కోసం కమిటీని ఏర్పాటు చేసింది.

# హైదరాబాద్‌కు ప్రజారోగ్యం ముప్పు

## జవహర్‌నగర్ డంపింగ్ యార్డులోని డబ్ల్యూటీఈ ప్లాంటు వల్ల దేశంలోనే అత్యధిక కాలుష్యం

## ఓపెన్ కాస్ట్ బొగ్గు గనులు, థర్మల్ విద్యుత్ ప్లాంట్లకన్నా అధిక కాలుష్యానికి కారణమవుతున్న వైనం

## శ్వాసకోశ సమస్యల బారిన పడుతున్న హైదరాబాద్ పరిసర ప్రాంత ప్రజలు

## సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ అకౌంటబిలిటీ తాజా నివేదికలో వెల్లడి



**హైదరాబాద్:** దేశంలోని పట్టణ ప్రాంతాల్లో చెత్త డంపింగ్ యార్డుల వల్ల తలెత్తుతున్న పర్యావరణ కాలుష్యానికి చెక్ పెట్టేందుకు ఏర్పాటు చేసిన చెత్త నుంచి విద్యుత్ తయారీ (డబ్ల్యూటీఈ) ప్లాంట్లు ఆ సమస్యను తీర్చకపోగా అందుకు విరుద్ధంగా అత్యధిక స్థాయిలో పారిశ్రామిక కాలుష్యానికి కారణమవుతున్నట్లు సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ అకౌంటబిలిటీ (సీఎఫ్ఏ) చేపట్టిన అధ్యయనంలో వెల్లడైంది. ఓపెన్ కాస్ట్ బొగ్గు గనులు, థర్మల్ విద్యుత్ ప్లాంట్లు, రాగి తయారీ పరిశ్రమలను మించిన స్థాయిలో డబ్ల్యూటీఈ ప్లాంట్లు కాలుష్యాన్ని వెదజల్లుతున్నట్లు తేలింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) కాలుష్య సూచీ ప్రకారం వీటికి 100కి 100 స్కోరు వచ్చినట్లు పేర్కొంది. ముఖ్యంగా హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ డంపింగ్ యార్డులో 48 మెగావాట్ల సామర్థ్యంగల డబ్ల్యూటీఈ ప్లాంటు ఉన్నప్పటికీ ఇది దేశంలోని చెత్త డంపింగ్ యార్డుల్లోకెల్లా అత్యధిక మీథేన్ వాయువు విడుదలకు కారణమవుతోందని.. ప్రపంచంలోనే ఇది నాలుగో అతిపెద్ద మీథేన్ కాలుష్యకారకంగా మారిందని సీఎఫ్ఏ తెలిపింది. జవహర్‌నగర్ నుంచి గంటకు 5.9 టన్నుల చొప్పున ఏటా సుమారు 49 వేల టన్నుల మీథేన్ వాయువు వాతావరణంలోకి విడుదలవుతోందని.. ఇది ఏటా గ్లోబల్ వార్మింగ్‌కు దారితీస్తున్న 39.6 లక్షల టన్నుల కార్బన్ డయాక్సైడ్‌కు సమానమని అధ్యయనం పేర్కొంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలితోపాటు ఢిల్లీ కాలుష్య నియంత్రణ కమిటీ అధికారిక గణాంకాలను పరిశీలించి రూపొందించిన ఈ నివేదికను సుప్రీంకోర్టుతోపాటు జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌కు సమర్పించినట్లు సీఎఫ్ఏ వెల్లడించింది.

ఈ నివేదిక ప్రకారం.. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు నుంచి విడుదలవుతున్న అత్యంత విషపూరితమైన రసాయన ద్రవాలు (లీచేట్) స్థానిక భూగర్భ జలాలను, చెరువులను పూర్తిగా కలుషితం చేస్తున్నాయి. అంతరిక్షం నుంచి నాసా (నాసా జేపీఎల్), కార్బన్ మ్యాపర్ ఉపగ్రహాలు గుర్తించేంత స్థాయిలో ఇక్కడి ఉద్గారాలు ఉండటం ఇక్కడి పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది. దీని ఫలితంగా హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తీవ్రమైన శ్వాసకోశ సమస్యలు, చర్మ వ్యాధులు, కేన్సర్ వంటి ప్రమాదకరమైన రోగాల బారిన పడుతున్నారు. భూగర్భ జలాలు భారీగా కాలుష్యం బారిన పడుతున్నాయి. మరోవైపు రంగారెడ్డి జిల్లాలోని సిద్ధాపూర్‌లో ఏటా 4 వేల టన్నుల సామర్థ్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన డబ్ల్యూటీఈ ప్లాంటు వల్ల ఆ ప్రాంతం మరో జవహర్‌నగర్‌గా మారుతుందని సీఎఫ్ఏ ఆందోళన వ్యక్తం చేసింది. డబ్ల్యూటీఈ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ, పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలు అవసరం లేకుండా ఉండేందుకు 2025లో కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి దేశంలోని డబ్ల్యూటీఈ ప్లాంట్లను రెడ్ కేటగిరీ నుంచి బ్లూ కేటగిరీలోకి మార్చడంపై సీఎఫ్ఏ అభ్యంతరం తెలిపింది. ఈ నిర్ణయం కాలుష్యకారక పరిశ్రమలకు రక్షణ కల్పించడమేనని.. అందువల్ల డబ్ల్యూటీఈ ప్లాంట్లను తిరిగి రెడ్ కేటగిరీలోకి తీసుకురావాలని డిమాండ్ చేసింది.

### గ్రాడ్యుయేట్ నియోజకవర్గాల ఆశావహుల జాబితా

# ఢిల్లీకి పంపిన టీపీసీసీ



**హైదరాబాద్:** వచ్చే ఏడాది మార్చి లో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు అధికార కాంగ్రెస్ పార్టీ ఆశావహుల జాబితా ఢిల్లీకి చేరినట్టు తెలుస్తోంది. హైదరాబాద్--రంగారెడ్డి--పాలమూరు ఉమ్మడి జిల్లాల నియోజకవర్గానికి ఆరుపేర్లు, నల్లగొండ--ఖమ్మం--వరంగల్ ఉమ్మడి జిల్లాల నియోజకవర్గానికి ఏడు పేర్ల చొప్పున అధిష్టానానికి వెళ్లాయని, ఈ పేర్లపై పార్టీ ముఖ్యులతో చర్చలు జరిపి ఢిల్లీ పెద్దలు నిర్ణయం తీసుకుంటారని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి.

**మంత్రుల అభిప్రాయం మేరకు..**

ఈ రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు అధికార పార్టీకి ప్రతిష్టాత్మకంగా మారాయి. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తోన్న ఉమ్మడి జిల్లా ఉన్న ఓ నియోజకవర్గం, పూర్తిగా కాంగ్రెస్ పార్టీ పట్టున్న మూడు జిల్లాల్లో రెండో నియోజకవర్గం ఉన్న నేపథ్యంలో ఈ రెండు చోట్ల గెలుపే ధ్యేయంగా అభ్యర్థుల కసరత్తును టీపీసీసీ నిర్వహించింది. ఇందులో ఆయా జిల్లాల్లో ప్రాతినిధ్యం వహిస్తోన్న మంత్రుల అభిప్రాయం కీలకంగా తీసుకుంది. పాలమూరు స్థానంలో నేతల అభిప్రాయాలు సేకరించే బాధ్యతలు మంత్రి దామోదరకు, నల్లగొండ స్థానంలో మంత్రి ఉత్తమ్‌కు బాధ్యతలు అప్పగించినట్టు సమాచారం. ఈ ఇరువురు ఆయా జిల్లాల్లోని మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జులు, డీసీసీ అధ్యక్షులతో మాట్లాడి వారి అభిప్రాయం మేరకు ఆరు పేర్లతో షార్ట్ లిస్టు చేసినట్టు తెలుస్తోంది. నల్లగొండ స్థానం నుంచి తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి కుమారుడు సరోత్తంరెడ్డి, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాశ్‌నేత, యువ నాయకుడు డాక్టర్ లోకేశ్‌యాదవ్, చనగాని దయాకర్‌ల పేర్లను పంపినట్టు తెలుస్తోంది. ఓ ఆర్టీఐ కమిషనర్ పేరును కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు. పాలమూరు స్థానం నుంచి టీశాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి, శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, విద్యావేత్త గౌరి సతీశ్, టీపీసీసీ నేత సామా రామ్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘం నేత గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి భీంభరత్‌ల పేర్లను పంపినట్టు సమాచారం. ఈ పేర్ల నుంచి ఎవరో ఒకరి అభ్యర్థిత్వాలను ఖరారు చేసే అవకాశాలున్నాయని, ఢిల్లీలో జరిగే సమావేశంలోపు ఇతర పేర్ల ప్రతిపాదనలు ఏవైనా వస్తే వాటిని కూడా పరిగణనలోకి తీసుకుంటారని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. త్వరలోనే ఢిల్లీ పెద్దలతో సీఎంతో పాటు పార్టీ ముఖ్య నేతలు కలిసిన సందర్భంలో ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలపై కూడా చర్చ జరుగుతుందని, వీలున్నంత త్వరలోనే ఓటరు నమోదు నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో ఈలోపే అభ్యర్థిత్వాలు ఖరారవుతాయని అంటున్నాయి.

# నర్సరీకి నిధులెక్కడ? మొక్కల సంరక్షణ ఏదీ!



వనపర్తి పట్టణ కేంద్రంలోని శ్రీనివాసపూర్ 8వ వార్డులో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో ప్రజా సమస్యలు పరిష్కారం కాలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మురికికాల్వల నిర్వహణ, పారిశుధ్యం, హరితహారం, నర్సరీ నిర్వహణపై బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, దేవర్ల నరసింహ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో మురికికాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో పారిశుధ్య సమస్యలు నెలకొంటున్నాయని ఆరోపించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కాల్వల శుభ్రతపై అధికారులు, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.రూ.1.50 కోట్ల నర్సరీ పరిస్థితిపై ఆందోళన,గతంలో సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో శ్రీనివాసపూర్‌లో సుమారు రూ.1.50 కోట్ల వ్యయంతో నర్సరీ ఏర్పాటు చేసినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ నర్సరీ నుంచి నాణ్యమైన మొక్కలను పార్కులు, ఇతర నర్సరీలకు, హరితహారం కార్యక్రమాలకు పంపించేవారని పేర్కొన్నారు.అదే విధంగా సుమారు రూ.50--60 లక్షలతో పాలీహౌస్ ఏర్పాటు చేసినప్పటికీ, ప్రస్తుతం దాని నిర్వహణ సరిగా లేక చిన్న మొక్కల స్థానంలో పెద్ద వృక్షాలు పెరిగే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు.

నర్సరీని పునరుద్ధరించి ప్రజలకు ఉపయోగపడేలా చేయడానికి కనీసం రూ.20 లక్షలు కేటాయించి అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పర్యావరణం, పారిశుధ్యంపై చిత్తశుద్ధి లేదని ఆరోపణ,కాంగ్రెస్ ప్రభుత్వానికి పర్యావరణ పరిరక్షణ, పారిశుధ్యంపై చిత్తశుద్ధి లేదని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. నర్సరీలు, హరితహారం మొక్కల సంరక్షణ, మురికికాల్వల శుభ్రతపై అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరారు.ఈ సందర్భంగా 8వ వార్డు కౌన్సిలర్ శంకరమ్మ, బాబు నాయక్ అధ్యక్షత వహించగా, రైతు సమితి అధ్యక్షుడు దేవర్ల నరసింహ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన మహిళలు, రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు,గంధం పరంజ్యోతి, ఉంగ్లం తిరుమల్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, స్టార్ రహీం, డేగ మహేశ్వర్‌రెడ్డి, సూర్యవంశం గిరి, జోహెబ్ హుస్సేన్, ఇమ్రాన్, చిట్యాల రాము, మంద రాము, నాశనల్లి రాజు, సాగర్, సిరువాటి శంకర్, నందిమల్ల రమేష్, మునికుమార్, సిరిగిరి మన్యం, అస్లాం, శివగౌడ్, లక్ష్మణ్ గౌడ్, గోకం శివకుమార్, పసుల బాలకృష్ణ, సేవ్య నాయక్, ఆరిఫ్, ఆదర్శ్, వజ్రాల రమేష్, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు...

## కాంగ్రెస్ పాలనలో గ్రామాల్లో విధ్వంసం

## ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల



**కోరుట్ల రూరల్ :** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ పల్లెలు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అధ్వాన స్థితికి చేరుకున్నాయని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలోని ఐలాపూర్ లాపూర్ గ్రామంలో పల్లెల విద్యాభివృద్ధి, పడకేసిన పారిశుధ్యానికి నిరసనగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పారిశుద్ధ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార కాంగ్రెస్ వైఫల్యాలను, పల్లెల పట్ల చూపుతున్న నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఎండగట్టారు. దేశంలో దాదాపు 6.5 లక్షల గ్రామాలు ఉంటే, ఉత్తమ గ్రామాల విభాగంలో కేంద్రం ప్రకటించిన 40 అవార్డుల్లో ఏకంగా 13 అవార్డులు (33 శాతం) సాధించి తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని గుర్తుచేశారు. నాడు కేసీఆర్ నాయకత్వంలో 'పల్లె ప్రగతి' ద్వారా ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, వైకుంఠ ధామాలు ఏర్పాటు చేసి పరిశుభ్రతకు పెద్దపీట వేశారని కొనియాడారు. కానీ ప్రస్తుత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వాటా నిధులు రూపాయి కూడా విడుదల చేయకపోవడంతో పల్లె ప్రకృతి వనాలు ఎండిపోయి, పారిశుధ్యం లోపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నాటిన 250 కోట్ల మొక్కలను సంరక్షించాల్సింది పోయి, అభివృద్ధి పనుల పేరిట చెట్లను విచక్షణారహితంగా నరికివేస్తున్నారని ఆరోపించారు. 420 హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్కు ప్రజలే బుద్ధి చెప్తాన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు ఇవ్వాలన్నారు. ?తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని, గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేసి పల్లెల అభివృద్ధిని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, మండల అధ్యక్షుడు నత్తి రాజ్ కుమార్. నియోజకవర్గం బి ఆర్ ఎస్ శ్రేణులు ప్రజలు పాల్గొన్నారు

## ప్రజలను మోసగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## ముత్యాల బలరాం రెడ్డి



**ధర్మారం :** ప్రజలను మోసగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం నయవంచన పాలన చేస్తుందని నంది మేడారం ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి వెయ్యి రోజుల విఫల పాలనపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో ఊరూరా ఆదివారం కాంగ్రెస్ ఎన్నికల గ్యారెంటీ కార్డులను ఊరూరా పంపిణీ చేశారు. ధర్మారం మండల కేంద్రంలో నంది మేడారం ప్యాక్స్ చైర్మన్ బలరాం రెడ్డి, పార్టీ పట్టణ శాఖ మాజీ అధ్యక్షుడు తుమ్మల రాంబాబు ఆధ్వర్యంలో స్థానిక పార్టీ నాయకులు బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బలరాం రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ పాలనలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేదని ఆయన ఆరోపించారు. 420 హామీలను ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క బతకాన్ని సంపూర్ణంగా అమలు చేయకుండా ప్రజలను మోసగించిందని మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కిన సీఎం రేవంత్ రెడ్డి పొద్దున లేస్తే కేవలం మాజీ సీఎం కేసీఆర్ పైనే ఆరోపణలు చేస్తూ ప్రజా పాలన పేరుతో దగా పాలన చేస్తున్నాడని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుంటే రాబోయే కాలంలో ఆ పార్టీ మూల్యం చెల్లించుకోక తప్పదని బలరాం రెడ్డి హెచ్చరించారు. నంది మేడారంలో పార్టీ మాజీ మండల అధ్యక్షుడు రాచూరి శ్రీధర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రజలకు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాలలో ధర్మారం మాజీ ఎంపీటీసీ కాంపల్లి చంద్రశేఖర్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కోమటిరెడ్డి మల్లారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ఆవులత, నాయకులు దేవి నలిని కాంత్, దేవి వంశీకృష్ణ, కూరపాటి శ్రీనివాస్, నాడెం శ్రీనివాస్, సల్వాజీ మాధవరావు ,గంధం తిరుపతి, అమరపల్లి నారాయణ, వేల్పుల కుమార్, కాంపల్లి అపర్ణ, ఈర్ల వనిత, కల్లేపల్లి లింగయ్య, ఆవుల వేణు, గాండ్ల నర్సయ్య, అయితే వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ శ్రేణుల జోలికొస్తే ఊరుకోం..

## పోలీసులకు మాజీ మంత్రి పువ్వాడ హెచ్చరిక



**జూలూరుపాడు :** కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, నేతల ఒత్తిళ్లకు తలొగ్గి పోలీసులు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి బెదిరింపులకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకునేది లేదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైరా నియోజకవర్గం జూలూరుపాడులో జరిగిన బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పోలీసులు ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో విధులు నిర్వహించారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో కొందరు పోలీసులు హింసను ప్రేరేపించేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. భవిష్యత్తులో రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ప్రస్తుతం అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి, తప్పుడు చర్యలకు పాల్పడుతున్న పోలీసు అధికారులు, సిబ్బందిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. తప్పుడు పనులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సరైన విధులు నిర్వహించి తగిన రీతిలో పనిచేయాలని పోలీసులకు హితవు పలికారు.

# బిజినెస్

## భారీగా బ్యాంకు ఉద్యోగాలు..




దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగార్థులకు తీపి కబురు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2026--27లో సుమారు 11,000 నుంచి 12,000 మంది ఉద్యోగులను నియమించుకోవాలని బ్యాంకు లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విషయాన్ని ఎస్బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి తెలిపారు. క్లరికల్, ఆఫీసర్ కేడర్లలోనే ప్రధానంగా నియామకాలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. నియామకాల సంఖ్యలో కొంత మార్పు ఉండొచ్చని శెట్టి పేర్కొన్నారు. ఉద్యోగుల పదవీ విరమణలు, బ్యాంకు అవసరాలను బట్టి తుది సంఖ్య నిర్ణయిస్తామని, అయితే ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి దాదాపు 12 వేల నియామకాలు ఉండొచ్చని చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈసారి నియామకాలు తగ్గడానికి ప్రధాన కారణం ఐటీ విభాగంలో గతేడాది మాదిరిగా పెద్ద సంఖ్యలో నిపుణులు అవసరం లేకపోవడమేనని ఆయన తెలిపారు.

### గతేడాది 25,633 మందికి ఉద్యోగాలు

2025--26 ఆర్థిక సంవత్సరంలో ఎస్బీఐ మొత్తం 25,633 మందిని నియమించుకుంది. ఇందులో 4,640 మంది అధికారులు, 19,340 మంది అసోసియేట్లు, 1,653 మంది కాంట్రాక్ట్ సిబ్బంది ఉన్నారు. ముఖ్యంగా సుమారు 1,500 మంది స్పెషలిస్ట్ ఐటీ అధికారులను గతేడాది నియమించినట్లు శెట్టి చెప్పారు. మార్చి 2026 నాటికి ఎస్బీఐ మొత్తం ఉద్యోగుల సంఖ్య 2.45 లక్షలకు పైగా ఉంది.

### మరో 250 శాఖలు రావొచ్చు

ఉద్యోగ నియామకాలతో పాటు బ్యాంకు శాఖల నెట్వర్క్ను కూడా విస్తరించేందుకు ఎస్బీఐ సిద్ధమవుతోంది. కొత్త కాలనీలు ఏర్పడుతున్న ప్రాంతాలు, వాణిజ్య కార్యకలాపాలు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఇంకా బ్యాంకింగ్ సేవలకు అవకాశం ఉందని శెట్టి తెలిపారు. కొన్ని శాఖలను హేతుబద్ధీకరించినప్పటికీ, నెట్గా ఏటా 200 నుంచి 250 శాఖలు పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు.

# 11 కంపెనీలు.. 7,055 కోట్లు..
## ఈ వారం ఐపీఓలు ఇవే




ప్రైమరీ మార్కెట్లో ఈ వారమూ పబ్లిక్ ఇష్యూల సందడి కొనసాగనుంది. 11 కంపెనీలు మొత్తం రూ.7,055 కోట్ల నిధుల సమీకరించనున్నాయి. సెప్టెంబర్ 7-15 మధ్య దలాల్ స్ట్రీట్లో ఈ ఐపీఓలు సందడి చేయనున్నాయి. ఇందులో రెంటోమోజో, కరమ్తర ఇంజినీరింగ్, కనోహర్ ఎలక్ట్రికల్స్ వంటి కంపెనీలు ఉన్నాయి. తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లను విక్రయించనున్నాయి. ఐపీఓ నిధులను వ్యాపార విస్తరణకు, రుణాల చెల్లింపులకు, ఇతర కార్పొరేట్ అవసరాలకు పలు కంపెనీలు వినియోగించనున్నాయి. ఇక ఆ వివరాలను పరిశీలిస్తే..

### ఎన్బీఐలో కొత్తగా 12 వేల నియామకాలు!

ప్రణవ్ కన్స్ట్రక్షన్స్ సెప్టెంబర్ 7న పబ్లిక్ ఇష్యూకు రానుంది. రూ. 351 కోట్ల నిధులను సమీకరించనుంది. సెప్టెంబర్ 9న ఐపీఓ సబ్స్క్రిప్షన్ ముగుస్తుంది. ఒక్కో షేరు ధర 118-124గా కంపెనీ నిర్ణయించింది.

కనోహర్ ఎలక్ట్రికల్స్ సెప్టెంబర్ 8న ఐపీఓకు వస్తోంది. రూ.1,056 కోట్ల నిధులను సమీకరించనుంది. ధరల శ్రేణి 601-632.

ప్రసోల్ కెమికల్స్ కూడా సెప్టెంబర్ 8న ఐపీఓకు రానుంది. ధరల శ్రేణి రూ.643-676గా కంపెనీ నిర్ణయించింది. రూ.500కోట్ల నిధులను సమీకరించనుంది. రూ.80 కోట్ల తాజా షేర్లు, రూ. 420 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయించనున్నారు.

గ్లాస్ వాల్ సిస్టమ్స్ (ఇండియా) ఐపీఓ సెప్టెంబర్ 8న రూ.428 కోట్ల నిధుల సమీకరణకు ఐపీఓకు వస్తోంది. ఒక్కో షేరు ధర రూ.172-182గా కంపెనీ నిర్ణయించింది.

రెంటోమోజో సెప్టెంబర్ 9న ఐపీఓకు వస్తోంది. ఒక్కో షేరు ధర రూ.384-404 కంపెనీ నిర్ణయించింది. రూ.1,256 కోట్ల నిధులను సమీకరించనుంది. రూ.150 కోట్ల తాజా షేర్లు, రూ.1,106 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఉండనున్నాయి.

కరమ్తర ఇంజినీరింగ్ రూ.875 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంగా సెప్టెంబర్ 9న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. రూ.675 కోట్ల తాజా షేర్లు, రూ.200 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు ఉండనున్నాయి. ధరల శ్రేణి రూ.241-254 కంపెనీ నిర్ణయించింది.

మణిపాల్ పేమెంట్ అండ్ ఐడెంటిటీ సొల్యూషన్స్ కూడా సెప్టెంబర్ 9న ఐపీఓకు వస్తోంది. రూ.805 కోట్ల నిధులను సమీకరించనుంది. ధరల శ్రేణి రూ.322-339గా నిర్ణయించింది. ఇందులో రూ.320 కోట్ల తాజా షేర్లు, రూ.485 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయిస్తున్నారు.

ఆర్సిల్ కంపెనీ రూ.733 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో సెప్టెంబర్ 9న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఒక్కో షేర్ ధర రూ.132-139గా నిర్ణయించింది. పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయిస్తున్నారు.

ఎల్సీసీ ప్రాజెక్ట్స్ ఐపీఓ సెప్టెంబర్ 9న ప్రారంభం కానుంది. రూ.427 కోట్ల నిధులను సమీకరించనుంది. ధరల శ్రేణి రూ.139-146గా కంపెనీ నిర్ణయించింది.

స్టీమ్హౌస్ ఇండియా రూ.414 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో సెప్టెంబర్ 9న ఐపీఓకు వస్తోంది. తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయిస్తున్నారు. ధరల శ్రేణి ఇంకా వెల్లడించలేదు.

వీగాలాండ్ డెవలపర్స్ కంపెనీ పబ్లిక్ ఇష్యూ సెప్టెంబర్ 10న ప్రారంభం కానుంది. సెప్టెంబర్ 15న సబ్స్క్రిప్షన్ ముగుస్తుంది. రూ.210 కోట్ల నిధులను ఐపీఓ నుంచి సమీకరించనుంది. ధరల శ్రేణి వెల్లడించాల్సి ఉంది.

# బ్యాంక్ అకౌంట్ లేకున్నా క్రెడిట్ కార్డు తీసుకోవచ్చా ? ఎవరికి జారీ చేస్తారు?

సార్/ మేడం మేం పలానా బ్యాంక్ నుంచి కాల్ చేస్తున్నాం. మీకు క్రెడిట్ కార్డ్ ఏమైనా కావాలా అని వారి రిప్రజెంటెటివ్స్ అడుగుతుంటారు. అయితే క్రెడిట్ కార్డు తీసుకోవడానికి బ్యాంకులో అకౌంట్ ఉండటం అవసరమా? అంటే తప్పనిసరిగా అదే బ్యాంకులో అకౌంట్ ఉన్న వ్యక్తికే క్రెడిట్ కార్డు ఇవ్వాలనే రూల్ ఉండదు. పలు బ్యాంకులు తమ వద్ద బ్యాంక్ అకౌంట్ లేని వారికి కూడా క్రెడిట్ కార్డులు జారీ చేస్తుంటాయి. నిపుణుల ప్రకారం, బ్యాంకులు ముందుగా దరఖాస్తుదారుడి ఆదాయం ఎంత, వారు ఏ పని చేస్తారు, క్రెడిట్ స్కోర్ ఎలా ఉంది. సమయానికి బిల్ పేమెంట్ చేయగలరా లేదా అనే విషయాన్ని పరిశీలిస్తారు. ఈ విషయాల్లో క్లారిటీ వస్తే చాలు బ్యాంక్ అకౌంట్ లేకుండానే కూడా ఆ వ్యక్తికి క్రెడిట్ కార్డు జారీ చేస్తారు.

### ఎఫ్డీని చూసి క్రెడిట్ కార్డు జారీ

కొన్నిసార్లు ఒక వ్యక్తికి బ్యాంక్ అకౌంట్ కూడా ఉండదు. దాంతో వారికి క్రెడిట్ హిస్టరీ కూడా ఉండదు. అలాంటి సందర్భాల్లో కొన్ని బ్యాంకులు ఎఫ్డీ(ఖీణ)కి బదులుగా కూడా క్రెడిట్ కార్డు జారీ చేస్తాయి. దీని ద్వారా ప్రజలకు మంచి క్రెడిట్ హిస్టరీ క్రియేట్ చేసుకునే అవకాశం లభిస్తుంది. అంటే వ్యక్తికి క్రెడిట్ కార్డు వస్తుంది. అక్కడి నుంచి ఆ వ్యక్తికి క్రెడిట్ హిస్టరీ ప్రారంభమవుతుంది.

### క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు ప్రక్రియ

క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు చేసేటప్పుడు ఆధార్ కార్డు, పాన్ కార్డు, అడ్రస్ ప్రూఫ్, మీ ఆదాయానికి సంబంధించిన కొన్ని అవసరమైన డాక్యుమెంట్స్ సబ్మిట్ చేయాలి. అయితే ప్రతి బ్యాంక్కు వారికంటూ వేర్వేరు రూల్స్, కండీషన్స్ ఉంటాయని గుర్తుంచుకోండి. చాలాసార్లు ప్రీపెయిడ్ కార్డు, క్రెడిట్ కార్డుకు ప్రత్యామ్నాయం అని ప్రజల్లో అపోహ ఉంటుంది. కానీ అందులో నిజం కాదు. ప్రీపెయిడ్ కార్డులో మీరు మీ డబ్బును ముందుగానే లోడ్ చేసి ఖర్చు చేస్తారు.




### క్రెడిట్ కార్డు, ప్రీపెయిడ్ కార్డుకు మధ్య వ్యత్యాసం ఏమిటి?

క్రెడిట్ కార్డు, ప్రీపెయిడ్ కార్డు 2 వేర్వేరు రకాల కార్డులు అని గ్రహించాలి. బిల్లులు సకాలంలో చెల్లిస్తూ క్రెడిట్ కార్డును సరిగ్గా ఉపయోగిస్తే మీ క్రెడిట్ స్కోర్ మెరుగుపడవచ్చు. అయితే ప్రీపెయిడ్ కార్డు వినియోగం క్రెడిట్ స్కోర్పై ఎలాంటి ప్రభావం చూపదు. ప్రీపెయిడ్ కార్డు అంటే ముందుగానే మనీ జమ చేసే కార్డు. వినియోగదారు కార్డులో ఉన్న మొత్తాన్ని తమ అవసరాలకు తగ్గట్లుగా ఖర్చు చేయవచ్చు. క్రెడిట్ కార్డును మీ వద్ద నగదు లేకపోయినా అందులో ఉన్న లిమిట్ వరకు షాపింగ్ చేయవచ్చు. బిల్లులు పే చేసే వీలుంటుంది. అందువల్ల ప్రీపెయిడ్ కార్డును క్రెడిట్ కార్డుగా భావించవద్దు.

### క్రెడిట్ కార్డుతో జాగ్రత్త

క్రెడిట్ కార్డును బాగా ఆలోచించి, జాగ్రత్తగా అవసరం ఉన్నప్పుడు మాత్రమే ఉపయోగించాలి. ఎంత ఖర్చు చేస్తారో, దాని బిల్ సైకిల్ సమయానికి తిరిగి చెల్లించాలి. సరిగ్గా ఉపయోగిస్తే క్రెడిట్ కార్డు అవసరమైన సమయంలో మిమ్మల్ని ఆదుకుంటుంది. క్రెడిట్ కార్డు తీసుకునే ముందు దాని వడ్డీ రేటు, వార్షిక ఫీజు, లేట్ ఫీజుతో పాటు ఇతర అన్ని ఛార్జీల గురించి పూర్తిగా తెలుసుకోవాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

# ఆ ఒక్క విజయం..
# పాక్ క్రికెట్ పతనం ప్రారంభం!




పాకిస్థాన్ క్రికెట్ జట్టు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సంక్షోభానికి ఆ జట్టు మాజీ కెప్టెన్ మహ్మద్ యూసుఫ్ ఒక విచిత్రమైన కారణాన్ని చూపాడు. దుబాయ్లో జరిగిన 2021 ఐసీసీ టీ20 ప్రపంచ కప్ (ఛ20 ఔజ 2021)లో భారత్పై పాకిస్థాన్ 10 వికెట్ల తేడాతో గెలిచిన తర్వాత తమ జట్టు పతనం మొదలైందని అభిప్రాయపడ్డాడు. ఆ విజయం తర్వాత కొంతమంది ఆటగాళ్లు తాము ఏదో గొప్ప విజయం సాధించామని విర్రవీగారని, కెప్టెన్సీ కోసం నెలకొన్న పోటీ డ్రెస్సింగ్ రూమ్లో విభేదాలను సృష్టించిందని పేర్కొన్నాడు.

"2021లో భారత్పై మేం గెలిచాం. ఆ మ్యాచ్ మాకు చాలా నష్టం కలిగించింది. ఎందుకంటే ఆ విజయం తర్వాత, తాము ఏదో గొప్ప విజయాన్ని సాధించామని కొందరు ఆటగాళ్లు భావించడం మొదలుపెట్టారు. ఆ తర్వాత ఏం చేయాలో వారికి అర్థం కాలేదు. మంచి ప్రదర్శన చేస్తున్నప్పుడు వినయంగా ఉండాలి. అహంకారంతో ప్రవర్తిస్తూ అగౌరవంగా వ్యవహరిస్తే సమస్యలు వస్తాయి. పాకిస్థాన్ క్రికెట్లో అటువంటి సమస్యలు చాలానే తలెత్తాయి. జట్టులోని ప్రతి ఒక్కరూ కెప్టెన్ కావాలని ప్రయత్నించారు. దాని పర్యవసానాలు ఇప్పటికీ పాకిస్థాన్ క్రికెట్కు నష్టం కలిగిస్తున్నాయి. భారత్పై విజయం తర్వాత వన్డే, టీ20 ప్రపంచ కప్లు, ఆసియా కప్లు, ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో పాక్ చెత్త ప్రదర్శన చేసింది. జట్టు నుంచి మంచి ఫలితాలు రాబట్టడానికి పీసీబీ ఎన్నో ప్రయత్నాలు చేసింది. కెప్టెన్లు, కోచ్లు, సహాయక సిబ్బందిని మార్చింది. అయినా ఏ ఆటగాడూ ముందుకు వచ్చి బాధ్యత తీసుకోలేదు" అని మహ్మద్ యూసుఫ్ పేర్కొన్నాడు.

2021 టీ20 ప్రపంచ కప్లో టీమ్ఇండియాతో జరిగిన మ్యాచ్లో 152 పరుగుల లక్ష్యాన్ని పాక్ ఒక్క వికెట్ నష్టపోకుండా ఛేదించింది. ఓపెనర్లు బాబర్ అజామ్ (68లి), మహ్మద్ రిజ్వాన్ (79లి) నాటౌట్గా నిలిచి జట్టుకు ఘన విజయం అందించిన విషయం తెలిసిందే. పొట్టి వరల్డ్ కప్ చరిత్రలో భారత్పై పాక్ గెలవడం అదే మొదటిసారి. ఇక, మహిళల క్రికెట్లో ఎన్నో ఏళ్లుగా పాకిస్థాన్పై తిరుగులేని ఆధిపత్యం చలాయిస్తున్న భారత జట్టు.. ఆసియా కప్లోనూ పైచేయి సాధించింది. శనివారం గ్రూప్-ఎలో తన చివరి మ్యాచ్లో హర్మన్ప్రీత్ సేన 7 వికెట్ల తేడాతో పాక్ను చిత్తు చేసింది.

### మా అక్కలు ప్లాన్ చేస్తే మేము ఆచరిస్తాం'



మహిళల ఆసియా కప్ 2026లో భారత మహిళా క్రికెటర్ శ్రీ చరణి తన ప్రదర్శనతో అదరగొడుతుంది. శనివారం పాకిస్తాన్తో జరిగిన మ్యాచ్లో 4 ఓవర్లు వేసిన శ్రీ చరణి కేవలం ఏడు పరుగులు మాత్రమే ఇచ్చి మూడు కీలక వికెట్లు తీసింది. మ్యాచ్లో చేసిన ప్రదర్శనకు గానూ శ్రీ చరణి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కించుకుంది. అవార్డు తీసుకున్న అనంతరం శ్రీ చరణి మాట్లాడింది. 'నా ప్రదర్శన పట్ల సంతృప్తిగా ఉన్నా. మహిళల క్రికెట్ ఆడుతూ దేశానికి సేవ చేయడం గొప్ప విషయంగా భావిస్తున్నా. అయితే ప్రతీ మ్యాచ్కు జట్టులోని స్పిన్నర్లమంతా ఒక మీటింగ్ ఏర్పాటు చేసుకుంటాం. నాతో పాటు ప్రేమ రావత్, దీప్తి శర్మ, రాధా యాదవ్ కలిసి మ్యాచ్లో ఎలా బౌలింగ్ చేయాలనేది చర్చించుకుంటాం. దీప్తి, రాధా దీదీలు చెప్పే ప్రతి సలహాను మైదానంలో అమలు చేయడానికి ప్రయత్నిస్తాం. 50 వికెట్ల మార్క్కు ఒక్క వికెట్ దూరంలోఎ ఉన్నప్పటికీ, వాటిని నేను పట్టించుకోను. బౌలింగ్పైనే నా దృష్టంతా పెట్టాలనుకుంటున్నా. ఇక నాతో పాటు బౌలింగ్లో వికెట్లు తీసిన ప్రేమ రావత్కు కూడా మంచి భవిష్యత్తు ఉంది. ఆమెది సహజమైన ప్రతిభ. ఫీల్డింగ్, బ్యాటింగ్, బౌలింగ్ అన్నీ సమానంగా ఉంటాయి. బౌలర్లకు సహకరించే వికెట్పై సుమారు 120 పరుగులు అనేది మంచి స్కోరు కింద లెక్కే. ఇకపై కూడా నా ప్రదర్శనను ఇలాగే కొనసాగించాలనుకుంటున్నా' అని చెప్పుకొచ్చింది. మ్యాచ్ విషయానికొస్తే పాకిస్తాన్పై భారత మహిళల జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ 18.1 ఓవర్లలో 55 పరుగులకు ఆలౌటైంది.

# స్పోర్ట్స్

## పట్టువదలని విక్రమార్కులు.. తొలిసారి చైనా మాస్టర్స్ విజేతగా సాత్విక్ జోడీ..!




భారత డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టి ఖాతాలో మరో టైటిల్ చేరింది. చైనా మాస్టర్స్(జష్ణఅఱ మీఱ్వతీం) సెమీస్లో సంచలన విజయంతో ఫైనల్ చేరిన ఈ జోడీ.. ఆఖరి పోరులో చైనా జంటను చిత్తు చేసింది. ఆదివారం జరిగిన ఫైనల్లో హే జీ టింగ్ -- రెన్ గ్జియాంగ్పై అద్భుతం విజయంతో విజేతగా నిలిచింది సాత్విక్ -- చిరాగ్ జంట. తొలి సెట్ కోల్పోయినా ఆత్మవిశ్వాసం కోల్పోకని భారత జోడీ వరసగా రెండు సెట్లలో గెలుపొందింది. దాంతో.. చైనా షట్లర్లకు నిరాశే మిగిలింది.

చైనా మాస్టర్స్లో సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టి ద్వయం ఛాంపియన్గా నిలిచింది. పురుషుల డబుల్స్లో అంచనాలు అందుకుంటూ ఫైనల్కు దూసుకెళ్లిన భారత జంట ఛాటికి చైనా షట్లర్లు చేతులెత్తేశారు. తొలి సెట్ను 11-21తో కోల్పోయిన సాత్విక్ జోడీ ఒత్తిడికి లోనవ్వలేదు. రెండో సెట్లో గొప్పగా ఆడి హే జీ టింగ్ -- రెన్ గ్జియాంగ్కు 21-13తో షాకిచ్చింది. నిర్ణయాత్మక మూడో సెట్లోనూ భారత ద్వయం చెలరేగింది. ఫలితంగా 21-17తో సెట్ను గెలుపొందడంతో పాటు టైటిల్నూ సొంతం చేసుకుందీ స్టార్ జోడీ. గతంలో రెండుసార్లు(2023, 2025) ఈ టోర్నీలో రన్నరప్గా నిలిచిన సాత్విక్ చిరాగ్ .. ఈసారి తమ కలను సాకారం చేసుకుంటూ విజేతగా నిలిచారు. మొత్తంగా ఈసీజన్లో వీరికి ఇది రెండో టైటిల్. ఈమధ్యే ఈ జంట సింగపూర్ ఓపెన్ సూపర్ 750 టైటిల్ను గెలిచింది.


మహానగర్





# అందరిని సర్‌ప్రైజ్ చేస్తుంది

గత ఏడాది 'ఓజీ' చిత్రంతో తెలుగులో మంచి విజయాన్ని దక్కించుకుంది తమిళ సొగసరి ప్రియాంక మోహన్. తాజాగా ఈ భామ తమిళంలో మరో బంపరాఫర్‌ను సొంతం చేసుకుంది. శింబు 'అరసన్' చిత్రంలో ఆమె కథానాయికగా ఎంపికైంది. ఈ విషయాన్ని ఓ అవార్డు వేడుకలో వెల్లడించింది ప్రియాంక మోహన్. వెట్రిమారన్ ఈ చిత్రానికి దర్శకుడు. ఉత్తర చెన్నై నేపథ్యంలో గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో అవకాశం రావడం పట్ల ప్రియాంక మోహన్ ఆనందం వ్యక్తం చేసింది. 'వెట్రిమారన్ మేకింగ్‌ స్టైల్ నాకు చాలా ఇష్టం. ఆయన ఎంచుకునే కథలు కూడా వాస్తవికతను ప్రతిబింబిస్తాయి. 'అరసన్'లో నా పాత్ర మునుపెన్నడూ చూడని రీతిలో ఉంటుంది. అందరిని సర్‌ప్రైజ్ చేస్తుంది. ఈ సినిమా కోసం నేను నార్త్ చెన్నై తాలూకు యాసను నేర్చుకున్నా' అని చెప్పింది ప్రియాంక మోహన్. 'అరసన్' చిత్రంలో విజయ్ సేతుపతి, ఆండ్రియా జెరేమియా, సముద్రఖని తదితరులు కీలక పాత్రల్ని పోషిస్తున్నారు.



# గన్స్‌కి గట్స్ ఉండాలి!

అగ్ర హీరో బాలకృష్ణ నటిస్తున్న 111వ చిత్రానికి 'దాదా' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 24న ప్రేక్షకుల ముందుకురానుంది. శనివారం టైటిల్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇందులో బాలకృష్ణ మాస్ అవతారంలో గ్యాంగ్‌స్టర్ వైబ్‌తో కనిపిస్తున్నారు. 'నాకు గురిపెట్టడానికి ఒంట్లో పొగరు, వేలికి ట్రిగ్గర్ ఉంటే సరిపోదు. బుల్లెట్స్‌కి బలుపు, గన్స్‌కి గట్స్ ఉండాలి' అంటూ బాలకృష్ణ చెప్పిన సంభాషణ ఆకట్టుకునేలా ఉంది. మంచు మనోజ్, కాజల్ అగర్వాల్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, సంభాషణలు: సాయిమాధవ్ బుర్రా, రచన-దర్శకత్వం: గోపీచంద్ మలినేని.



# మన ప్యానెల్‌దే విజయం

తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి (2026) అధ్యక్షుడిగా ప్రముఖ నిర్మాత సి.కల్యాణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఎన్నికల్లో మన ప్యానెల్, ప్రోగ్రెసివ్ ప్యానెల్ పోటీ పడ్డాయి. మన ప్యానెల్ నుంచి సి.కల్యాణ్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కోశాధికారిగా చదలవాడ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా మోహన్ వడ్లపట్ల, దామోదర ప్రసాద్, జాయింట్ సెక్రటరీలుగా అమ్మిరాజు, తుమ్మలపల్లి రామసత్యనారాయణ ఎంపికయ్యారు.ప్రపంచ పటాలు పరిశీలించండి ఏషియన్ సునీల్, మోహన్‌గౌడ్, మైత్రీ రవి, నిరంజన్ రెడ్డి, డి.ఎస్.రావు, పద్మిని, శివలెంకకృష్ణ ప్రసాద్, దానయ్య, వంశీ నందిపాటి, పల్లి కేశవరావు, శ్రీనివాసరావు, పుల్లారావు, బాపిరాజు, ఆర్.కె.గౌడ్, నయీం కార్యవర్గ సభ్యులుగా గెలుపొందారు. ఈ ఎన్నిల్లో మన ప్యానెల్ నుంచి అత్యధిక మంది సభ్యులు విజయం సాధించారు. కార్యదర్శి పదవి అంశంపై కోర్టు కేసు నడుస్తున్నది. ఈ నేపథ్యంలో ఆ ఫలితాన్ని సీల్డ్ కవర్‌లో కోర్టుకు అప్పగించనున్నారు. ఈ నెల 8వ తేదీన కార్యదర్శి ఎన్నికల ఫలితాన్ని వెల్లడించనున్నారు.

# ఘనంగా 'మండాడి' ప్రీ రిలీజ్ ఈవెంట్..

## సినిమాపై హైప్ పెంచేసిన చిత్ర యూనిట్!




తమిళ వర్సటైల్ నటుడు సూరి, టాలీవుడ్ ట్రెండ్ సెట్టింగ్ యంగ్ హీరో సుహాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక మరియు విభిన్నమైన ఇంటెన్స్ యాక్షన్ డ్రామా 'మండాడి'. ప్రముఖ నిర్మాత ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ పతాకంపై టాలెంటెడ్ డైరెక్టర్ మతిమారన్ పుగళేంది ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. బోట్ రేసింగ్ ప్రధానాంశంగా, ఎవ్వరూ చూడని సరికొత్త సముద్రపు నేపథ్యంలో అత్యంత రిస్క్‌తో కూడిన ఛాలెంజింగ్ పరిస్థితులలో ఈ సినిమాను రూపొందించారు. ఇందులో టాలెంటెడ్ నటి మహిమా నంబియార్ కథానాయికగా నటిస్తుండగా.. సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్ వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో ప్రేక్షకులను అలరించనున్నారు. సెప్టెంబర్ 10న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతున్న తరుణంలో, చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో అత్యంత ఘనంగా ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు శివ నిర్వాణ ముఖ్య అతిథిగా విచ్చేసి సినిమా పోస్టర్లు, ప్రమోషనల్ కంటెంట్‌పై ప్రశంసలు కురిపిస్తూ యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.నగర పర్యటనలను అన్వేషించండి ఈ వేడుకలో హీరో సుహాస్ మాట్లాడుతూ.. తన సినీ ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులను దాటుకుంటూ ఈ స్థాయికి చేరుకున్నానని భావోద్వేగంగా పంచుకున్నారు. ఈ రోజు గురువారపు పండుగ రోజున తన ఉపాధ్యాయులు తన ముందే ఉండటం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఈ చిత్రంలో మహిమ, రవీంద్ర విజయ్, సూరిల అభినయం సినిమాకు ప్రధాన ప్రాణంగా నిలుస్తాయని, ఇదొక వినూత్న థియేట్రికల్ అనుభూతిని ఇస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తమిళ నటుడు సూరి తనదైన శైలిలో మాట్లాడుతూ.. తెలుగు ప్రేక్షకులు తనపై చూపిస్తున్న ఆప్యాయతకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే తను అనర్గళంగా తెలుగు మాట్లాడటానికి ప్రయత్నిస్తానని చెప్పి అందరినీ నవ్వించారు. సుహాస్‌తో కలిసి పనిచేయడం తనకు ఎంతో తృప్తినిచ్చిందని, బోట్ రేసింగ్ మరియు యాక్షన్ ఎపిసోడ్స్ ఆడియన్స్‌కు సరికొత్త లోకాన్ని పరిచయం చేస్తాయని పేర్కొన్నారు. ఈ వేడుకలో పాల్గొన్న ఇతర నటినటులు, సాంకేతిక నిపుణులు మాట్లాడుతూ.. సముద్రపు అలల మధ్య, ప్రాణాలకు తెగించి ఈ సినిమాను ఎంతో కష్టపడి షూట్ చేశామని తెలిపారు. ముఖ్యంగా మైత్రి మూవీ మేకర్స్ అధినేత నవీన్ తమకు అందించిన అనూహ్య సహకారాన్ని, ఓటీటీ డీల్స్‌లో ఆయన చేసిన మేలును ప్రొడ్యూసర్ ఎల్రెడ్ కుమార్ కృతజ్ఞతాపూర్వకంగా గుర్తుచేసుకున్నారు. ఈ ఈవెంట్‌కు స్పెషల్ గెస్ట్‌గా విచ్చేసిన ప్రముఖ డైరెక్టర్ శివ నిర్వాణ మాట్లాడుతూ.. 'మండాడి' చిత్రంలోని కొన్ని కీలక సన్నివేశాలు, రషెస్ చూసినప్పుడే ఈ సినిమా ఘనవిజయం సాధించడం ఖాయమని ఫిక్స్ అయ్యానని, భవిష్యత్తులో ఈ చిత్రానికి జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు దక్కుతాయని జోస్యం చెప్పారు. మరో అతిథిగా విచ్చేసిన హిట్ డైరెక్టర్ శైలేష్ కొలను మాట్లాడుతూ.. సముద్రంలో బోట్ షాట్స్ తీయడంలోని కష్టాలను ప్రస్తావిస్తూ, సినిమా మొత్తం సముద్రంలోనే తెరకెక్కించడం సాహసోపేతమని, ఇందుకు యూనిట్ అంకితభావాన్ని కొనియాడాలని అన్నారు. మొత్తానికి, విభిన్నమైన కథాంశంతో, పవర్‌ఫుల్ యాక్షన్ ఎమోషన్స్‌తో, బోట్ రేసింగ్ బ్యాక్‌డ్రాప్‌తో రాబోతున్న 'మండాడి' సినిమా సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి!

# ఎన్టీఆర్ సినిమాలో అదిరిపోయే స్పెషల్ సాంగ్..
# భారీ సెట్‌లో ఇద్దరు హీరోయిన్లతో మాస్ ట్రీట్!



యంగ్ టైగర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. 'డ్రాగన్' లేదా 'బ్రూస్ లీ' అనే వర్కింగ్ టైటిల్స్‌తో ప్రచారంలో ఉన్న ఈ సినిమా ఇప్పటికే భారీ హైప్‌ను సొంతం చేసుకుంది. 'కేజీఎఫ్', 'సలార్' వంటి సినిమాలతో తనదైన యాక్షన్ బ్రాండ్‌ను క్రియేట్ చేసుకున్న ప్రశాంత్ నీల్.. ఎన్టీఆర్‌ను ఎలా చూపించబోతున్నారనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.ఇక ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఓ క్రేజీ అప్‌డేట్ ఇండస్ట్రీ వర్గాల్లో వైరల్ అవుతోంది. సినిమా కోసం ఓ భారీ స్పెషల్ సాంగ్‌ను చిత్రీకరించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఈ పాట కోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రశాంత్ నీల్ సినిమాల్లో యాక్షన్ సన్నివేశాలతో పాటు భారీ విజువల్స్‌కు కూడా ప్రత్యేక స్థానం ఉంటుంది. అదే తరహాలో ఎన్టీఆర్ సినిమాకు కూడా ఆయన స్పెషల్ సాంగ్‌ను భారీ స్థాయిలో డిజైన్ చేస్తున్నట్లు టాక్.ఈ పాట కోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది. పాటలో కనిపించే విజువల్స్ ప్రేక్షకులకు థియేటర్‌లో మాస్ ట్రీట్ ఇచ్చే విధంగా ఉండబోతున్నాయని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.సినిమా కథ, యాక్షన్‌తో పాటు ఈ పాట కూడా హైలైట్‌గా నిలిచేలా ప్రశాంత్ నీల్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999